
# శుభోదయం!

WWW.SUBHODAYAMDAILY.COM

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 39, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం - 28 - ఏప్రిల్ - 2025


## కస్తూరి రంగన్‌కు ప్రధాని మోదీ నివాళి..
## దేశానికి ఆయన సేవలు చిరస్మరణీయం



ఇస్రో మాజీ చీఫ్, ప్రముఖ శాస్త్రవేత్త డా. కె. కస్తూరి రంగన్‌కు ప్రధాని మోదీ నివాళి

'మన్ కీ బాత్' కార్యక్రమంలో కస్తూరి రంగన్ సేవలను కొనియాడిన ప్రధాని

శాస్త్ర, విద్యా రంగాలు, అంతరిక్ష కార్యక్రమాల్లో ఆయన కృషి అపారమని ప్రశంస

కస్తూరి రంగన్ నాయకత్వంలో ఇస్రోకు, దేశానికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని వ్యాఖ్య

## సిద్ధరామయ్య వ్యాఖ్యలకు పాక్ మీడియాలో ప్రాధాన్యం
### – తీవ్రంగా స్పందించిన కర్ణాటక బీజేపీ



పహల్గామ్ దాడి నేపథ్యంలో పాక్‌తో యుద్ధం అవసరం లేదన్న సీఎం సిద్ధరామయ్య

సిద్ధరామయ్య వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రసారం చేసిన పాకిస్థాన్ మీడియా

సీఎం తీరుపై తీవ్రంగా స్పందించిన కర్ణాటక బీజేపీ, ప్రతిపక్ష నేత అశోక

సిద్ధరామయ్య శత్రుదేశానికి తోలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని అశోక విమర్శ

### భారత్, హిందువులపై మరోసారి
## విషం చిమ్మిన పాక్ ఆర్మీ చీఫ్




దాయాది దేశంపై చర్యలకు ఉపక్రమించిన భారత్

భారత్‌పై విషం చిమ్ముతున్న పాక్ నేతలు

మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేసిన పాక్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్

## కర్రెగుట్టలో మావోయిస్టుల గుహ..
## 1000 మంది ఉండేలా నీటి సౌకర్యం..



- తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ మధ్య ఆపరేషన్ కర్రె గుట్టల్లో భాగంగా భద్రతా బలగాలు కీలక ముందడుగు
- కర్రెగుట్టలో మావోయిస్టుల బంకర్(గుహ)ను భద్రతా బలగాలు గుర్తింపు
- కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు ఐదో రోజు కూంబింగ్ కొనసాగింపు

# రాష్ట్రం స్వర్ణాంధ్ర 2047 విజన్
# సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది
## విశాఖపట్నం ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుంది

రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో విశాఖపట్నంలో గణనీయమైన మార్పులు

- నగరం ఇప్పటికే ఆర్థిక రాజధానిగా, జ్ఞాన కేంద్రంగా రూపాంతరం చెందింది
- "విశాఖపట్నం ఒక ముఖ్యమైన నగరం. దీనికి ముందు ముందు ఉజ్వల భవిష్యత్తు ఉంది"




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన నగరంగా గుర్తింపు పొందిన విశాఖపట్నం, రాష్ట్రం స్వర్ణాంధ్ర 2047 విజన్ సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంచనా వేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది భవనాన్ని ప్రారంభిస్తూ, వైజాగ్ నగరానికి తన వద్ద ఉన్న ప్రతిష్ఠాత్మక అభివృద్ధి ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. నగరం ఇప్పటికే ఆర్థిక రాజధానిగా, మిగతా..2లో

## బీఆర్ఎస్ ఏకైక ఎజెండా తెలంగాణే..
## 25 ఏళ్ల ప్రస్థానంలో ఇదే మా నిబద్ధత: కేటీఆర్



పార్టీ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకునితెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరణ అమరవీరులు, ఉద్యమ నేతలకు నివాళులు

# పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్ర స్పందన

- దాడికి పాల్పడిన వారికి, కుట్రదారులకు కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక
- బాధితుల కుటుంబాలకు తప్పక న్యాయం చేస్తామని హామీ
- కశ్మీర్‌లో శాంతి, అభివృద్ధిని చూసి శత్రువులు కుట్ర పన్నారు
- ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే కీలకమని మోదీ ఉద్ఘాటన

## ఉగ్రదాడి దోషులను వదిలిపెట్టం: నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ,: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ అమానవీయ చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుకున్న కుట్రదారులకు అత్యంత కఠినమైన శిక్ష మిగతా..2లో

# షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు బిగ్ షాక్..
## భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు ఆదేశించిన పవన్ కల్యాణ్

- వైసీపీ హయాంలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు అటవీ భూముల కేటాయింపు
- సత్వరమే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- 49.8 ఎకరాలను షిర్డిసాయి సంస్థకు రూ.42.48 కోట్లకు కట్టబెట్టిన వైనం



అమరావతి,: షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన భూములు శేషాచలం వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. మిగతా..2లో

# ప్రధాని రాక వేళ
# మారుతున్న చంద్రబాబు లెక్కలు

- రాజధాని అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు
- అమరావతి పనుల ప్రారంభం కోసం ప్రధాని మోదీ
- ప్రధాని మోదీ మే 2న అమరావతి పర్యటన షెడ్యూల్ ఖరారు
- పీఎం మోదీ అమరావతిలో జపాన్ 'మియావాకి' విధానం అమలు చేయాలని సూచన
- తాడికొండలో 12,797 ఎకరాలు సమీకరణ పద్ధతిలో తీసుకోనున్నారు.




అమరావతి,: రాజధాని అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. అమరావతి పనుల ప్రారంభం కోసం ప్రధాని మోదీ మే 2న రానున్నారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. రోడ్ షో ఏర్పాటు చేసారు. రైతులు ప్రధానికి అరుదైన స్వాగతం పలికేందుకు సిద్దం అవు తున్నారు. ప్రధాని సభలో అమరావతి రైతులకు ప్రత్యేకంగా అవకాశం కల్పిస్తున్నారు. బహిరంగ సభలోనూ ప్రధాని ప్రసంగించ నున్నారు. కాగా, ప్రధాని పర్యటన వేళ రాజధాని లో మిగతా..2లో

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో తమిళనాడు నేత రాధాకృష్ణన్ భేటీ ..
## 'కరుంగాలి కంబు' బహుకరణ



- పవన్ కల్యాణ్ ను మర్యాద పూర్వకంగా కలిసిన తమిళనాడు నేత రాధాకృష్ణన్
- పర్యావరణ పరిరక్షణ పోరాటాలను పవన్‌తో పంచుకున్న రాధాకృష్ణన్

## ఏయూ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభం..




వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపు

విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

ఏయూ ఘన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి పిలుపు

ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్ శేషాద్రి శేఖర్, ఎంపీ శ్రీభరత్, వీసీ రాజశేఖర్ ప్రసంగాలు

శతాబ్ది లోగో ఆవిష్కరణ, విజన్ డాక్యుమెంట్ విడుదల, విశ్రాంత ఆచార్యులకు సన్మానం

ఏడాది పొడవునా వేడుకలు.. నోబెల్ గ్రహీతలను ఆహ్వానించనున్నట్లు వీసీ వెల్లడి

అమరావతి,:ఆంధ్ర విశ్వకళాపరిషత్ (ఏయూ) శతాబ్ది ఉత్సవాలు శనివారం విశాఖపట్నంలో అట్టహాసంగాప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం వందేళ్ల మైలురాయిని పురస్కరించుకుని, ఏయూ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత మిగతా..2లో

## కస్తూరి రంగన్‌కు ప్రధాని మోదీ నివాళి.. దేశానికి ఆయన సేవలు చిరస్మరణీయం

**న్యూఢిల్లీ,:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ ఛైర్మన్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయనకు నివాళు లర్పించారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో మాట్లాడుతూ.. దేశం ఒక గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్ర, విద్యా రంగాలకు, ముఖ్యంగా భారత అంతరిక్ష కార్యక్రమాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో కస్తూరి రంగన్ చేసిన విశేష కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన నాయకత్వంలో ఇస్రోకు నూతన గుర్తింపు లభించిందని, ఆయన మార్గదర్శకత్వంలో పురోగమించిన అంతరిక్ష కార్యక్రమం దేశానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చిపెట్టిందని కొనియాడారు. ప్రస్తుతం భారత్ ఉపయోగిస్తున్న అనేక ఉపగ్రహాలు కస్తూరి రంగన్ పర్యవేక్షణలోనే ప్రయోగించిన విషయం గుర్తు చేసుకున్నారు. నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పనలో డాక్టర్ కస్తూరి రంగన్ కీలక పాత్ర పోషించారని ప్రధాని తెలిపారు. 21వ శతాబ్దానికి అనుగుణంగా, భవిష్యత్ దృక్పథంతో కూడిన విద్యా వ్యవస్థ ఆవిష్కరణకు ఆయన ఎంతో దోహదపడ్డారని పేర్కొన్నారు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన, ఆవిష్కరణలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మోదీ అన్నారు. దేశ నిర్మాణం కోసం కస్తూరి రంగన్ అందించిన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని చెబుతూ ప్రధాని ఆయనకు వినమ్ర నివాళులర్పించారు. అంతకుముందు, శుక్రవారం కూడా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా కస్తూరి రంగన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, దేశ శాస్త్ర, విద్యా రంగ ప్రస్థానంలో ఆయనొక శిఖర సమానులని అభివర్ణించిన విషయం తెలిసిందే.

## సిద్ధరామయ్య వ్యాఖ్యలకు పాక్ మీడియాలో ప్రాధాన్యం – తీవ్రంగా స్పందించిన కర్ణాటక బీజేపీ

**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో యుద్ధానికి వెళ్లాల్సిన అవసరం లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను పాకిస్థాన్ మీడియా ప్రముఖంగా ప్రసారం చేయడంతో కర్ణాటక బీజేపీ తీవ్ర స్థాయిలో మండిపడింది. ముఖ్యమంత్రి శత్రుదేశానికి తోలుబొమ్మలా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్ష నేత ఆర్.అశోక ఘాటు విమర్శలు చేశారు. శనివారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ సిద్ధరామయ్య, పహల్గామ్ దాడి తర్వాత పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలన్న చర్చలపై స్పందించారు. "ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. మేము యుద్ధానికి అనుకూలం కాదు. శాంతి నెలకొనాలి, ప్రజలు సురక్షితంగా భావించాలి, కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి" అని ఆయన పేర్కొన్నారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలను పాకిస్థాన్ కు చెందిన ఓ న్యూస్ ఛానెల్ ప్రసారం చేసిన వీడియోను ఆర్.అశోక తన '%శ%' ఖాతాలో పంచుకున్నారు. సిద్ధరామయ్యను 'పాకిస్థాన్ రత్న'గా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. "మీ అసంబద్ధ ప్రకటనలతో రాత్రికి రాత్రే పాకిస్థాన్‌లో మీరు ప్రఖ్యాతి గాంచారు. భవిష్యత్తులో మీరు పాకిస్థాన్‌కు వెళ్తే ఘన స్వాగతం లభించడం ఖాయం. పాకిస్థాన్‌కు గొప్ప శాంతి రాయబారిగా మిమ్మల్ని గుర్తించి, వారి అత్యున్నత పౌర పురస్కారం 'నిషాన్-ఎ-పాకిస్థాన్'తో సత్కరించినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని అశోక వ్యంగ్యంగా అన్నారు. దేశం అత్యంత సున్నితమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న వేళ, సీఎం శత్రుదేశానికి తోలుబొమ్మలా వ్యవహరించడం దేశ దౌర్భాగ్యమని ఆయన మండిపడ్డారు. పహల్గామ్ దాడి ఘటనలో కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యం ఉందని కూడా సిద్ధరామయ్య ఆరోపించారు. "పర్యాటకులు అధికంగా వచ్చే ప్రాంతంలో సరైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సింది. గతంలో పుల్వామాలో 40 మంది సైనికులు చనిపోయారు. ఇక్కడ అత్యంత జాగ్రత్తగా ఉండాల్సింది. ఇది నిఘా వైఫల్యం, భద్రతా వైఫల్యం కూడా. ప్రజలు సురక్షితంగా ఉన్నామని నమ్మారు, కానీ కేంద్రం భద్రత కల్పించలేకపోయింది" అని ఆయన విమర్శించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది తిరిగి వస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఘటన జరిగినప్పుడు అక్కడ ఒక్క భద్రతా సిబ్బంది కూడా లేరన్న వార్తలపై స్పందిస్తూ, కశ్మీర్‌కు పంపిన మంత్రి సంతోష్ లాడ్‌తో మాట్లాడాక వివరాలు తెలుస్తాయని అన్నారు. రాష్ట్రంలోని పాకిస్థానీ పౌరులను వెనక్కి పంపే విషయంలో కేంద్రానికి సహకరిస్తామని, బెంగళూరులో ఎక్కువ మంది పాక్ జాతీయులు ఉన్నారని, పూర్తి వివరాలు తన వద్ద లేవని సిద్ధరామయ్య తెలిపారు. పహల్గామ్ దాడి అనంతరం జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని హాజరుకాకపోవడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. బీహార్ ఎన్నికల ప్రచారమా? అఖిలపక్ష సమావేశమా? ఏది ముఖ్యమని సిద్ధరామయ్య ప్రశ్నించారు.

### భారత్, హిందువులపై మరోసారి
## విషం చిమ్మిన పాక్ ఆర్మీ చీఫ్

**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ దాయాది దేశంపై చర్యలకు ఉపక్రమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పాక్ నేతలు భారత్‌పై విషం చిమ్ముతూనే ఉన్నారు. తాజాగా పాక్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. రెండు దేశాల మధ్య సిద్ధాంత ప్రస్తావనను తీసుకువస్తూ.. అన్ని అంశాల్లో హిందూ, ముస్లింలు వేర్వేరని వ్యాఖ్యానించారు. మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షల్లో హిందూ, ముస్లింలు వేర్వేరని పేర్కొన్న అసిం మునీర్.. వాటి ఆధారంగానే రెండు దేశాలు ఉండాలనే భావన ఏర్పడిందన్నారు. పాకిస్థాన్ ఏర్పాటుకు పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేశారని, వాటిని ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసునని ఆయన అన్నారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్థాన్ మిలటరీ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్‌లో అసిం మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు ప్రవాస పాకిస్థానీల తొలి సదస్సులో కూడా మునీర్ ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారు. మనది ఒక దేశం కాదని, రెండు దేశాలు అని అన్నారు. కశ్మీర్ తమ జీవనాడి లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ఇలా ఆయన వ్యాఖ్యానించిన కొన్ని రోజుల్లోనే పహల్గామ్‌లో ఉగ్రదాడి జరగడం గమనార్హం.

### కర్రెగుట్టలో మావోయిస్టుల గుహ.. 1000 మంది ఉండేలా నీటి సౌకర్యం..



చర్ల: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య ఆపరేషన్ కర్రె గుట్టల్లో భాగంగా భద్రతా బలగాలు కీలక ముందడుగు వేశాయి. ఐదు రోజుల సెర్చ్ ఆపరేషన్‌లో తాజాగా మావోయిస్టుల కీలక స్థావరమైన బంకర్‌ను బలగాలు గుర్తించాయి. ఈ గుహ గురించి కీలక విషయాలను వెల్లడించాయి. వివరాల ప్రకారం.. కర్రెగుట్టలో మావోయిస్టుల బంకర్(గుహ)ను భద్రతా బలగాలు గుర్తించాయి. ఇక, ఆ గుహలో దాదాపు 1000 మంది సురక్షితంగా ఉండేలా ప్రదేశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. గుహలో నీటి సౌకర్యం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, భద్రతా బలగాల రాకను పసిగట్టిన మావోయిస్టులు.. అక్కడి నుంచి మకాం మార్చినట్టు సమాచారం. మరోవైపు.. కర్రె గుట్టలో అనేక గుహలు ఉండటంతో భద్రతా బలగాలకు సవాళ్లు ఎదరవుతున్నాయి. తాజాగా బంకర్(గుహ)కు సంబంధించి వీడియోలను భద్రతా బలగాలు విడుదల చేశాయి. ఇదిలా ఉండగా.. కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు ఐదో రోజు కూంబింగ్ కొనసాగించాయి. సాయంత్రం 4 గంటలు కాగానే చీకటి పడటం.. 5 అడుగుల దూరంలో మనిషి కూడా కనిపించనంత దట్టమైన అడవి ఉండటంతో ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు తమకు అత్యంత సురక్షితంగా భావిస్తారు. ఇలాంటి చోట ఆపరేషన్ బలగాలకు కత్తిమీద సాముగా మారింది. గల్గం అడవుల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి ఒక డీఆర్‌జీ జవాన్‌కు గాయాలు కాగా బీజాపుర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కి.మీ. పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అతి కష్టం మీద శనివారం సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను, ఆయుధాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో తమిళనాడు నేత రాధాకృష్ణన్ భేటీ .. 'కరుంగాలి కంబు' బహుకరణ



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో తమిళనాడుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, రచయిత, పర్యావరణ పోరాట నేత కె.ఎస్. రాధాకృష్ణన్ శనివారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్తమాన తమిళనాడు రాజకీయాలు, భాషా సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ సంబంధిత అంశాలపై చర్చించారు. పర్యావరణ పరమైన విషయాల్లో, రైతాంగ పోరాటం, కన్నగి ఆలయం విషయమై కేరళ ప్రభుత్వంతో సాగిన న్యాయ పోరాటంలో తన పాత్రను రాధాకృష్ణన్ పవన్‌కు తెలియజేశారు. పశ్చిమ కనుమలలో పర్యావరణ పరిరక్షణకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో చేసిన పోరాటాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాజకీయంగా తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి, నెడుమారన్, ఈవీకే సంపత్ లాంటి నాయకులతో ఉన్న అనుబంధాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌ను సత్కరించి 'కరుంగాలి కంబు'ను రాధాకృష్ణన్ బహుకరించారు. కరుంగాలి కంబుకి ఇరువైపులా పవిత్రమైన పంచలోహాలతో కూడిన క్యాప్స్ ఉంటాయని ఆయన తెలిపారు. కాగా, ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ప్రధాని రాక వేళ మారుతున్న చంద్రబాబు లెక్కలు

మొదటి పేజి తరువాయి



ప్రధాని పర్యటన వేళ రాజధాని లో చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్త లెక్కలతో ముందుకు వెళ్తున్నారు. ప్రధాని మోదీ మే 2న అమరావతి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తాజాగా ఢిల్లీలో ప్రధానితో సీఎం చంద్రబాబు కలిసిన సమయంలో అమరావతి ప్రణాళికలను వివరించారు. ఆ సమయంలోనే పీఎం మోదీ అమరావతిలో జపాన్ 'మియావాకి' విధానం అమలు చేయాలని సూచించారు. ఇక, ఇటు అమరావతి విస్తరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పుడున్న 54 వేల ఎకరాలకు తోడు అద నంగా 44,676 ఎకరాలు సమీకరించనున్నారు. దీనికోసం మూడు మండలాల పరిధిలో 11 గ్రామాలను గుర్తించారు. కొత్తగా సేకరించే గ్రామాలతో కలిపి రాజధాని ప్రాంతం మొత్తం లక్ష ఎక రాలకు చేరుకుంటుంది. వారం రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూ రు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు సమీకరణకు నోటిఫికేషన్ ఇవ్వగానే సిఆర్‌డిఎ సమీకరణ ప్రక్రియ చేపట్టనుంది. అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో 2015లో తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలో ప్రస్తుత రాజధానిగా నిర్ణయించిన ప్రాంతంలో సమీకరించిన భూముల్లో రైతులకు ఇప్పటి వరకూ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వలేదు. కొత్తగా మరోసారి పూలింగు అంటే రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇన్నర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాలతోపాటు, ఎర్రుపాలెం, నంబూరు రైల్వేలైన్‌కు అవసరమైన భూములను కలిపి సమీకరణ చేయనున్నారు. ఇటీవల మంత్రి నారాయణ రాజధాని చుట్టుపక్కల స్మార్ట్ ఇండ్రస్ట్రీస్ ఏర్పాటుకు భూ సమీకరణ చేస్తామని, ప్రజలు అంగీకరించకపోతే సేకరణకు వెళతామనీ ప్రకటించారు. ఆయన అన్నదే తడవుగా పూలింగు పరిధిలోకి వచ్చే గ్రామాల్లో కూటమి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేశారు. అభ్యంతరాలున్నా రైతులందరూ అంగీకరించినట్లు ప్రకటించారు. కొత్తగా పూలింగు చేపట్టబోయే గ్రామాల్లో తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం, వడ్డమాను రెవెన్యూ గ్రామాలను పూర్తిగా చేర్చారు. హరిశ్చంద్రాపురంలో 2,429 ఎకరాలు, వడ్డమానులో 1,937 ఎకరాలను సమీకరించనున్నారు. పెద రిమిలో 6,513 ఎకరాలు తీసుకోనున్నారు. అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురంలో 3,360 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167, కర్లపూడిలో 2,947, మోతడకలో 2,345, నిడుముక్కలలో 2,013 ఎకరాలు సమీకరణ కింద తీసుకోనున్నారు. తాడికొండ మండల పరిధిలో తాడికొండలో 12,797 ఎకరాలు సమీకరణ పద్ధతిలో తీసుకోనున్నారు. కంతేరులో 3,671, మంగళగిరి మండలం కాజలో 4,492 ఎకరాలు మొత్తం 44,676 ఎకరాలు సమీకరణ కింద తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే కార్యాచరణ ప్రారంభించేందుకు వీలుగా సిఆర్‌డిఎ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను రైతులతో సమావేశాలు నిర్వహించి ముందుగా వారిని సిద్ధం చేయాలని సూచించింది. ఈసారి పూలింగులో కొత్త జాతీయ రహదారి వరకూ చేపట్టనున్నారు.

## దక్షిణాదిలో కూడా బీజేపీ జెండా ఎగరేస్తాం!

హైదరాబాద్: దక్షిణాది ప్రజలకు మేలు చేస్తాం అని, ప్రజల హృదయాలలో చోటు సంపాదించి ఇక్కడ కూడా జెండా ఎగరేస్తాం అని కేంద్రమంత్రి కమ్ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో అధికారంలోకి వస్తామన్నారు. దక్షిణ భారతదేశానికి ప్రధాని మోడీ నేతృత్వంలో ఎలాంటి అన్యాయం జరగదన్నారు. ప్రధాని మోడీ పేద కుటుంబం నుంచి వచ్చారని.. పేద ప్రజల గుండె చప్పుడు ఆయనకు తెలుస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మన్ కీ బాత్ పూర్తయిన అనంతరం మేధావుల సదస్సు ప్రారభమైంది. ఈ సదస్సులో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. మేధావుల సదస్సులో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'రాజ్యాగ రూపశిల్పిగా ఉన్నా సంతోషం లేదని డా.బీఆర్ అంబేద్కర్ అన్నారు. దేశం కులం, మతం పేరిట విడిపోవాలని అంబేద్కర్ కోరుకోలేదు. ప్రజలందరూ కలిసి మెలసి ఉండాలని ప్రయత్నించారు. 2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయినపుడు పార్లమెంటు గడపకు శిరసు వంచి నమస్కరించారు, అంబేద్కర్‌ను స్మరించుకున్నారు. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బీజేపీ ప్రభుత్వం పాలన చేస్తోంది. ముంబైలో అతిపెద్ద విగ్రహం బీజేపీ నిర్మించబోతోంది. పార్లమెంటులో అంబేద్కర్ చిత్రపటం పెట్టారు మోడీ. బ్రతికున్న వాళ్ళందరికీ భారతరత్న ఇచ్చింది కాంగ్రెస్. అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చిన ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం మాత్రమే' అని అన్నారు. 'భారతదేశం అనగానే మోడీ కంట్రీ అని అన్ని దేశాలూ అంటున్నాయి. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో అధికారంలోకి వస్తాం. దక్షిణ భారతదేశానికి మోడీ నేతృత్వంలో ఎలాంటి అన్యాయం జరగదు. దక్షిణాది ప్రజలకు మేలు చేస్తాం.. ప్రజల హృదయాలలో చోటు సంపాదించి ఇక్కడ కూడా జెండా ఎగరేస్తాం. అంబేద్కర్ స్మారక కేంద్రం ఏర్పాటు చేసింది బీజేపీ. 12 కోట్ల టాయిలెట్లు పేద ప్రజల కోసం నిర్మాణం చేశారు మోడీ. ఆయుష్మాన్ భారత్ పేరిట ఒక రక్షణ కల్పించారు మోడీ. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడే రిలయన్స్, అదానీ, టాటా వచ్చారు. ఆ ముగ్గురి చేతిలో దేశ సంపద ఉందంటాడు రాహుల్ గాంధీ. 75 సంవత్సరాలు దాటిన పెద్దలకు ఉచితంగా ఆయుష్మాన్ భారత్ ఇచ్చారు మోడీ. పేద ప్రజల గుండె చప్పుడు నరేంద్ర మోడీకి తెలుస్తుంది. మోడీ పేద కుటుంబం నుంచీ వచ్చారు.. ఆయన తాతా, నానమ్మ రాజకీయ నాయకులు కాదు. మోడీ గుజరాత్ సీఎం అయ్యాక అభివృద్ధి గురించి మిగతా సీఎంలు తెలుసుకున్నారు. మొదటిసారి మోడీ ప్రధాని అయ్యాక రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీ వచ్చింది. కాంగ్రెస్, కమ్యూనిస్టులు బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. భారతదేశాన్ని విశ్వగురుగా తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు మోడీ' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### బీఆర్ఎస్ ఏకైక ఎజెండా తెలంగాణే.. 25 ఏళ్ల ప్రస్థానంలో ఇదే మా నిబద్ధత: కేటీఆర్

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఏకైక ఎజెండా తెలంగాణ రాష్ట్రమేనని, పార్టీ 25 ఏళ్ల ప్రస్థానంలో ఇదే నిబద్ధతతో పనిచేసిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు (కేటీఆర్) స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు బయలుదేరే ముందు కేటీఆర్ హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "25 ఏళ్ల క్రితం పార్టీ ప్రస్థానం మొదలైనప్పుడు తెలంగాణ సాధనే ఏకైక ఎజెండాగా పెట్టుకున్నాం. నేటికీ మా ఎజెండా తెలంగాణే. రాష్ట్రం ఏర్పడిన తర్వాత, తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ నిరంతరం కృషి చేసింది" అని తెలిపారు. అంతకుముందు కేటీఆర్, ఇతర పార్టీ నాయకులు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి, పార్టీ ప్రస్థానానికి స్ఫూర్తి ప్రదాతలని కేటీఆర్ కొనియాడారు. వారి స్ఫూర్తితో పాటు కేసీఆర్ నాయకత్వంలో పార్టీ 25 ఏళ్ల ప్రస్థానంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన కేటీఆర్, ఇదే ప్రాంతంలోని జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పురుడు పోసుకుందని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని పునరుద్ధరించేందుకు కేసీఆర్ 2001లో టీఆర్ఎస్‌ను స్థాపించగా, 2022లో పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన సంగతి తెలిసిందే. కేవలం ఒక వ్యక్తితో ప్రారంభమైన పార్టీ ప్రస్థానం, లక్షలాది మంది ప్రజల మద్దతుతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుందని కేటీఆర్ అన్నారు. అమరవీరుల ఆశీస్సులు, పెద్దల దీవెనలతో బీఆర్ఎస్ మరో 25 ఏళ్లు తెలంగాణ సమాజానికి సేవ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమ పార్టీగా పుట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని, అధికార పార్టీగా ఉజ్వల తెలంగాణను ఆవిష్కరించామని, ఇప్పుడు ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుతున్నామని కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. తెలంగాణ సమాజం అప్పగించిన ప్రతి బాధ్యతను పవిత్ర కర్తవ్యంగా భావించి, నిబద్ధతతో నెరవేర్చామని తెలిపారు. ఇన్నేళ్లుగా కేసీఆర్ నాయకత్వంలో పార్టీతో పాటు నడిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ, పార్టీ జెండాను ఎప్పుడూ ఎత్తులో ఉంచుతామని ప్రతిన పూనారు.

## పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్ర స్పందన

దీని వెనుకున్న కుట్రదారులకు అత్యంత కఠినమైన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బాధితుల కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడినీ కలచివేసిందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈరోజు మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ, నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి ప్రతి పౌరుడి హృదయాన్ని గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఏ భాష మాట్లాడే వారైనా, ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు" అని మోదీ తెలిపారు. ఉగ్రవాద దాడి చిత్రాలను చూసిన తర్వాత ప్రతి భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడని తాను అర్థం చేసుకోగలనని ప్రధాని అన్నారు. "ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నిరాశకు, పిరికితనానికి పహల్గామ్ దాడి అద్దం పడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొంటున్న తరుణంలో, పాఠశాలలు, కళాశాలలు తిరిగి కళకళలాడుతున్న వేళ, అభివృద్ధి పనులు ఊపందుకున్న సమయంలో, ప్రజాస్వామ్యం బలపడుతున్నప్పుడు, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పుడు, యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నప్పుడు.. దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చలేదని ప్రధాని విమర్శించారు. "కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు, వారి యజమానులు ఇంత పెద్ద కుట్ర పన్నారు" అని మోదీ ఆరోపించారు. ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద బలమని ప్రధాని నొక్కిచెప్పారు. "ఈ ఐక్యతే ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఆధారం. ఈ సవాలును ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. ఒక దేశంగా మనం బలమైన సంకల్ప శక్తిని ప్రదర్శించాలి. ఈ ఉగ్రదాడి తర్వాత యావత్ దేశం ఒకే గొంతుకతో మాట్లాడుతున్న విషయాన్ని నేడు ప్రపంచం గమనిస్తోంది" అని ఆయన అన్నారు. ఈ దాడి ఘటనపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సంతాప సందేశాలను ప్రధాని ప్రస్తావించారు. "భారతీయులమైన మనం అనుభవిస్తున్న ఆగ్రహాన్నే యావత్ ప్రపంచం కూడా అనుభవిస్తోంది. ఉగ్రదాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ నాయకుల నుంచి నాకు ఫోన్ కాల్స్, సందేశాలు అందాయి. వారంతా ఈ ఘోరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులతో యావత్ ప్రపంచం నిలుస్తోంది" అని మోదీ వివరించారు. "బాధిత కుటుంబాలకు నేను మరోసారి హామీ ఇస్తున్నాను, మీకు న్యాయం జరుగుతుంది. కచ్చితంగా న్యాయం జరుగుతుంది. ఈ దాడికి పాల్పడిన వారు, కుట్రదారులు అత్యంత కఠినమైన ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

### ఏయూ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభం..

మొదటి పేజి తరువాయి

పారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్లుగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని, ఎందరో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, వివిధ రంగాల నిపుణులను దేశానికి అందించిందని కొనియాడారు. తన కుటుంబంలోని మూడు తరాల వారు ఇక్కడే విద్యనభ్యసించారని, అలాంటి విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం గర్వంగా ఉందని తన వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యారంగంలో వేగంగా మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికతను విద్యాసంస్థల్లో ప్రవేశపెట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, అందుకు అవసరమైన పెట్టుబడులు పెడుతోందని వివరించారు. ఏయూ ఘన వారసత్వాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్, ఏయూ పూర్వ విద్యార్థి ఆచార్య ఎ. శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ తాను ఉన్నతస్థాయికి చేరుకోవడానికి ఏయూనే కారణమని కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రాథమిక సూత్రాలు, శాస్త్ర సంబంధ అంశాలపై పట్టు సాధించడంతో పాటు, ఆధునిక ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను (సాఫ్ట్‌స్కిల్స్) కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ, అకడమిక్, మౌలిక వసతులు, పరిశోధన రంగాల్లో ఏయూని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తామని చెప్పారు. ఏడాది పొడవునా జరిగే శతాబ్ది వేడుకలకు నోబెల్ బహుమతి గ్రహీతలను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ, ఏయూకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఏయూకి, తమ సంస్థ (గీతం)కు మధ్య ఎలాంటి పోటీ లేదని, కొన్ని వర్గాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా తొలుత ఏయూ వ్యవస్థాపక ఉపకులపతి సర్ సి.ఆర్. రెడ్డి చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పహల్గామ్ మృతులకు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏయూ విశ్రాంత ఆచార్యులు ఆచార్య సీహెచ్ శాంతమ్మ, ఆచార్య బి. ప్రసాదరావులను సత్కరించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి షేక్ రఫీ రూపొందించిన శతాబ్ది ఉత్సవాల లోగోను, వేడుకలకు సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్. కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు, ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ కె.వి.వి. రావు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం బీచ్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. ఏయూ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు బిగ్ షాక్..

మొదటి పేజి తరువాయి



అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు పీసీసీఎఫ్‌కు ఆదేశాలిస్తూ విచారణ చేసి సత్వరమే నివేదిక అందజేయాలని సూచించారు. షిర్డిసాయి కంపెనీకి కేటాయించిన భూముల్లో అటవీ భూముల క్రమబద్ధీకరణ చట్టం 1980 నిబంధనలు పూర్తిగా విస్మరించారని, అటవీ చట్టాలను ఉల్లంఘించి కేటాయింపులు జరిపారని వచ్చిన మీడియా కథనాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించి అధికారులతో సమీక్షించారు. భూ కేటాయింపులు, సంబంధిత వివరాలు నివేదిక రూపంలో అందజేయాలని, కేటాయింపుల ప్రక్రియపై వివరాలు ఇవ్వాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జగన్ ప్రభుత్వ హయాంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సమీపంలోని ఐటీ సెజ్ భూములను డీనోటిఫై చేయించి దానిలో 49.8 ఎకరాలను షిర్డిసాయి సంస్థకు రూ.42.48 కోట్లకు నామమాత్రపు ధరకు కట్టబెట్టారు. ఆ భూముల విలువ ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రూ.150 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ భూముల్లో షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ శుచి అల్లాయ్స్ అండ్ కండక్టర్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ స్థాపించింది. అయితే విలువైన భూములను షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు అతి తక్కువ ధరకు కట్టబెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పులివెందులకు చెందిన న్యాయవాది టి. జయరామ్ సమాచార హక్కు చట్టం కింద అటవీ శాఖకు ఇటీవల దరఖాస్తు చేస్తూ వివరాలు కోరారు. దీంతో ఆ శాఖ వివరాలు అందించింది. షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ నిర్మించిన పరిశ్రమ ప్రాంతం శేషాచలం వన్యప్రాణి అభయారణ్యంగా పీసీసీఎఫ్ తన నివేదికలో పేర్కొంది. ఈ మేరకు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కి నివేదికను కూడా సమర్పించింది. సదరు పరిశ్రమ తమ శాఖ పరిధిలోని భూములలో వన్య, అటవీ చట్టాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారని తాజాగా గుర్తించారు. అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసినట్లు గుర్తించిన అధికారులు సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయం మొత్తం మీడియాలో రావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి విచారణకు ఆదేశించారు.

## రాష్ట్రం స్వర్ణాంధ్ర 2047 విజన్ సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది

మొదటి పేజి తరువాయి




నగరం ఇప్పటికే ఆర్థిక రాజధానిగా, జ్ఞాన కేంద్రంగా రూపాంతరం చెందిందని ఆయన హైలెట్ చేశారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో.. భోగాపురం విమానాశ్రయం దాదాపుగా పూర్తవుతుండటం, మెట్రో రైలు ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కావడం వంటి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను హైలైట్ చేశారు. ఇవి షెడ్యూల్ ప్రకారం పూర్తవుతాయని ఆయన హామీ ఇచ్చారు. గూగుల్, టాటా వంటి ప్రపంచ దిగ్గజాలతో సాంకేతిక పురోగతులు, వ్యూహాత్మక సహకారాల ద్వారా రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో విశాఖపట్నంలో గణనీయమైన మార్పులను ఆయన అంచనా వేశారు. కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్) ను ఎయిమ్స్ ప్రమాణాలకు పెంచాలని, రూ.60 కోట్ల పెట్టుబడితో లెవల్-2 క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అనకాపల్లిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) ప్రారంభించబడుతుందని తెలిపారు. "విశాఖపట్నం ఒక ముఖ్యమైన నగరం. దీనికి ముందు ముందు ఉజ్వల భవిష్యత్తు ఉంది" అని ఆయన ప్రకటించారు, ప్రశాంతతకు ప్రసిద్ధి చెందిన ఈ నగరంలో ప్రతి ఒక్కరూ నివసించాలని కోరుకుంటారని అన్నారు. అంబేద్కర్, అబ్దుల్ కలాం, ఎన్టీఆర్ వంటి వ్యక్తుల దార్శనిక నాయకత్వం నుండి ప్రేరణ పొంది, పి-4 విధానం, స్వర్ణాంధ్ర 2047 వేదిక ద్వారా రాష్ట్ర పురోగతికి తన నిబద్ధతను సీఎం పునరుద్ఘాటించారు. కొత్తగా నిర్మించిన సెంటీనరీ భవన సముదాయాన్ని చంద్రబాబు నాయుడు పరిశీలించారు. భారతదేశంలోని పురాతన సంస్థలలో ఒకటైన ఆంధ్రా మెడికల్ కాలేజీకి అత్యాధునిక సౌకర్యాన్ని సృష్టించడంలో దాతలు, పూర్వ విద్యార్థుల సమిష్టి కృషిని ఆయన ప్రశంసించారు.

## భారత రాష్ట్ర సమితి 25వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



మంగపేట, మండల రిపోర్టర్ – తులసి (శుభోదయం న్యూస్): స్వరాష్ట్రం కోసం పుట్టిన జెండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన జెండాతెలంగాణ ప్రజల ఆత్మగౌరవ జెండా మన గులాబీ జెండాబిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల ఆవిర్భావం సందర్భంగా మంగపేట మండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు అనంతరం మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షులు నూనె



లింగయ్య బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు.భారత రాష్ట్ర సమితి 25 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పార్టీ,నాయకులకు కార్యకర్తలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంగపేట మండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మినారాయణఅనంతరం వరంగల్‌లోని ఎల్కతుర్తిలో కేసీఆర్ అధ్యక్షతన జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు మంగపేట మండలంలో ఆయా గ్రామాల నుండి గ్రామ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజలందరితో కలిసి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గున్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన షెడ్యూల్
## రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్)రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన షెడ్యూల్:ఏప్రిల్ 28 ఉ. 10.00 గం : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ , గోదావరిఖని శాఖ,మేడిపల్లి లింగాపురం శాఖ, 8 ఇంక్ లైన్ కాలనీ శాఖ, ఏప్రిల్ 29 ఉ. 10.00 గం : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ , మార్కండేయ కాలనీ శాఖ, రమేష్ నగర్ శాఖ.ఏప్రిల్ 30 ఉ. 10.00 గం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ , గోదావరిఖని శాఖ, మేడిపల్లి చౌరస్తా శాఖ,బ్యాంక్ ఆఫ్ ఇండియా జ్యోతి నగర్ శాఖహెచ్ డి ఎఫ్ సి ,రామగుండం శాఖ,ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్,గోదావరిఖని శాఖ, ఇండియన్ బ్యాంక్, ఐ సి ఐ సి సి బ్యాంక్, కె డి సి సి , యాక్సిస్ బ్యాంక్ తో పాటుమిగిలిన అన్ని ఇతర బ్యాంకు శాఖలు.అభ్యర్థులు ఒరిజినల్ పాన్ , ఆధార్, ఆహార భద్రత కార్డు/ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రంతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో షెడ్యూలు ప్రకారం హాజరు కావాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), కమీషనర్(ఎఫ్ ఎ సి ) జె.అరుణ శ్రీ ఒక ప్రకటన లో కోరారు.

## రజతోత్సవ సభకు
## నాగార్జున సాగర్ నుండి బయలు దేరిన గులాబీ శ్రేణులు



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్) : ఆదివారం వరంగల్ రజతోత్సవ బహిరంగ సభ సందర్భంగా నాగార్జునసాగర్ నుండి అధిక సంఖ్యలో బీఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వెళ్లటం జరిగింది. ఈ కార్యక్రమం నకు నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేసి చలో వరంగల్ కర్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కోటి రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన టిఆర్ఎస్ పార్టీ ఈరోజు అంచలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి చేరుకుందంటే కేసీఆర్ త్యాగం ,కృషి ఎంతో ఉందని కొనియాడారు లక్షల మంది కార్యకర్తలు కలిగిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తున్న తీరును చూసి ప్రజలు విసుకు చెందారన్నారు రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో ఎంసి కోటిరెడ్డి తో మాజీ కౌన్సిలర్ హీరేకార్ రమేష్ జి సయ్యద్ మక్సూద్, లక్ష్మణ్ నాయక్, కాంపల్లి రామస్వామి, సపావత్ చంద్రమౌళి నాయక్, పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక
## సమ్మెను జయప్రదం చేయండి సిఐటియు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కేంద్రంలోని బిజెపిప్రభుత్వంఅవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20 తేదీనజరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు కార్మికులను కోరారు.ఆదివారం వలిగొండ మండలకేంద్రంలోగ్రామపంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలును స్వదేశీ విదేశీ, కార్పొరేట్ శక్తులకు, దారధతం చేస్తున్నా యి అని అన్నారు.ఈ ప్రభుత్వ రంగ సంస్థలనుప్రైవేటీకరణ చేయడం వల్ల సామాజిక న్యాయందెబ్బతింటుందని,రిజర్వేషన్లు రద్దు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులు పోరాడి సాధించు కున్న 44 కార్మిక చట్టాలు రద్దుచేసి,4 లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా ప్రజల మధ్యన కుల మతాల పేరుతో విభజన సృష్టించి రాజకీయ పబ్బం గడుపుతుందని అన్నారు.మోడీ విధానాలకు వ్యతిరేకంగా నూట నలభై ఐదు కోట్ల ప్రజల ప్రయోజనాలకోసం మే 20 జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తూర్కపల్లి సురేందర్, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కొండే నరసింహ,రాములుమండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవెల్లి ఎల్లమయ్యా,మండల నాయకులు,రాములురేణుక,శ్రీరాములు, తాళ్ల సత్తయ్య, అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో తడిసిన
## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి -సిపిఎం డిమాండ్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గ్రామాల్లో అకాల వర్షాలతో ఐకెపి సింగిల్ విండో కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం కారణంగా మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ఐకెపి,సింగిల్ విండో కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసి ముద్దయిందని దీనివల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అదేవిదంగా కొనుగోలు కేంద్రాల్లో సరిపడ టార్పిన్ కవర్లు అందుబాటులో ఉంచి భవిష్యత్తులోనైనా దాన్యం తడవకుండా ధాన్యానికి రక్షణ కల్పించాలని,ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని లారీల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైస్ మిల్లర్ల

## అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్
## ఆల్ ఇండియా ఉపాధ్యక్షులుగా సోదా రామకృష్ణ ఎన్నిక



పరకాల నియోజకవర్గం, (శుభోదయం న్యూస్): నిన్నటి రోజున మహారాష్ట్రలోని నాగపూర్ లో జరిగిన ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జాతీయస్థాయి ఎన్నికలు జరగగా ఈ ఎన్నికల్లో ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులుగా సోదా రామకృష్ణ వాల్మీకి ఎన్నికైనారు. ఆల్ ఇండియా ఉపాధ్యక్షులుగా నియమించిన జాతీయ అధ్యక్షులు చరణ్ సింగ్ ఠాగూర్ కి, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ పర్ చా , తదితరులు పాల్గొన్నారు.

## మహిలా అని చూడకుండా కులంపేరుతో దూషించిన
## స్పెషల్ ఆఫీసర్ ను విదులనుండి తొలగించాలి
### మాజీ ఎంపిపి ఉరిమెట్ల రాజలింగు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) ఎప్రిల్ -26: పెద్దపల్లి జిల్లా అంతర్గం మండలం మొరుమూరు గ్రామనికి చెందిన ఉరిమెట్ల సుజాత బర్త ఎక్స్ ఎం పి పి రాజలింగు తేది 24-4-2025 రోజున గ్రామసభ జరిగినది ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ గా తూము రవీందర్ గ్రామసభ లొ పాల్గొనగ. ఉరిమెట్ల సుజాత సార్ మాఇంటి వద్ద కాలువ దురువాసన వస్తుంది దోమలు ఉన్నాయి విష జ్వరాలు వచ్చే అవకాశము ఉంది అని అడిగినందుకు నెను ఒక టి ఎన్ జి ఓ లొ జిల్లా అధ్యక్షుడిని నన్ను అడిగే అధికారం నికులేదు కులం తక్కువదాన అని అన్నాడు ఇంటివద్దనే కాకుండ గ్రామపంచాయితీ కార్యాలయానికి పిలిచి అందరిముందు నన్ను నిలబెట్టి ఒక మాజీ ఎం పి పి భార్యను అనిచూడకుండ.నన్ను నిలుచుండబెట్టి నాన బూతులు తిడుతూ అవమానించాడు.నిది తక్కువ జాతి అని తిట్టాడు న్యాయం చేయవలసిన స్పెషల్ ఆఫీసర్ ఇలా అవమానపరిస్తే మెము ఎవరికి చెప్పాలి అని ఈ రొజు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు.ఫిర్యాదు చెశాం బాధితురాలు భర్త కుల సంగాల నాయకులు అధికార పార్టి ప్రతినిధులు పుదరి సత్తయ్య గౌడ కాంగ్రెస్ పార్టి డి సి సి జనరల్ సీక్రెటరి అంతర్గం. పెంద్యాల మహెష్ బి సి సెల్ జిల్లా అద్యక్షుడు పెద్దపల్లి. మామిడిపెల్లి బాపయ్య అంబెద్కర్ సంగం రాష్ట్ర నాయకుడు. జులా లింగయ్య డి సి సి ఆర్గనేజేర్ సీక్రెటరి. కొదురుపాక పవన్ మండల్ అద్యక్షుడు.ఈ రవిందర్ కుమార్ సంతోష్ కల్లపెల్లి అశోక్ కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి. మొదుంపెల్లి శ్రావణ్ కె వి పి ఎస్ అద్యక్షుడు పెద్దపల్లి.కాటుకూరి సందీప్ ఎంపి కాంటెస్టెడ్ అభ్యర్థి.తదితరులు పాల్గొన్నారు.

## : పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ
## శ్రీహర్ష దంపతులకు రెండో కుమారుడు జన్మించాడు
## సంతోషంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) ఏప్రిల్ -26: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయకు ప్రభుత్వ వైద్యులు ప్రసవం చేయగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఏరియా ఆసుపత్రికి సంబంధించిన సీనియర్ వైద్యురాలు హెచ్వోడి అరుణ నేతృత్వంలో శిరీష,లక్ష్మి వైద్య బృందం కలెక్టర్ భార్యకు శస్త్ర చికిత్సలు నిర్వహించి పురుడు పోశారు.కలెక్టర్ భార్య విజయ గర్భవతిగా ఉన్నప్పటి నుండి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి లోనే వైద్య సేవలను పొందుతుంది. ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహించుకుంది. కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఇది రెండో సంతానం ,మొదటి సంతానంలో కూడా కుమారుడు జన్మించగా రెండో సంతానంలో కూడా కలెక్టర్ కు మరో వారసుడొచ్చాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ భార్య కు సక్సెస్ గా ఆపరేషన్ జరిగి పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష సంతోషం వ్యక్తం చేశారు.వైద్యులతో ఒక తండ్రిగా కలెక్టర్ తన ఆనందాన్ని సంతోషాన్ని పంచుకోవడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందాలన్న సర్కారు ఆలోచన విధానాలను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తూచా తప్పకుండా పాటించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందాలన్న ఆలోచన విధానంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. కలెక్టర్ తీరును అందరూ అభినందించారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
# ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



సంగెం : (శుభోదయం న్యూస్) : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రైతును రాజును చేయాలని ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజున సంగెం మండలం లోని చింతలపల్లి గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) (ఐకెపి) వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు.ప్రభుత్వం ద్వారా రూ.500 బోనస్ వచ్చినందుకు రైతులుఅందరు సంతోషం వ్యక్తం చేశారు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు లక్ష రుణమాఫీ, నేడు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. సన్న బియ్యంతో పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని గొప్ప సంకల్పంతో రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్దిదారునికి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపడుతున్న గొప్ప ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దారు రాజ్ కుమార్,ఎంపీడీవో రవీందర్,ఏవో యాకయ్య,ఏపీఎం కిషన్,ఏఈఓ కార్తీక్,కార్యదర్శి రాజకుమార్,సీసీ సురేశ్,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు,పిఎసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల రవి, మాజీ సర్పంచ్ ఇండ్ల రవికుమార్,మాజీ ఉపసర్పంచ్ బండి రాధిక, గ్రామ పార్టీ అధ్యక్షులు ఇండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి,నరహరి,జనగాం రమేష్,మెట్టుపల్లి రమేష్,మంజుల,లక్ష్మి,కవిత,అనురాధ,కుమారస్వామి,ఏలీయా, మహిళలు,రైతులు,అధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య ఎరుకల ఐక్యవేదిక మండల మండల కమిటీ ఎన్నిక






మంగపేట, మండల రిపోర్టర్ – తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండలం రమణక్కపేట గ్రామ పరిధిలో శనివారం రోజున ఏకలవ్య ఎరుకల ఐక్యవేదిక సంఘం ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ములుగు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి సమ్మయ్య అధ్యక్షతన మంగపేట మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది..సభాధ్యక్షుడు పాలకుర్తి సమయం మాట్లాడుతూ.. స్వతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడుస్తున్న ఎరుకల కులస్తులు స్థితిగతులు ఏమాత్రం మారలేదు, ఏ పాలకుడు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు మైనార్టీలో ఉన్న మనకు, ఇన్ని సంఘాలు ఎందుకు అనే సదుద్దేశంతో అన్ని సంఘాలను ఏకం చేసి దగాపడ్డ ఎరుకల జాతి ప్రగతి పదంపై నడిపించేందుకు అందరం ఏకం కావాలి అని ఏకలవ్య ఎరుకల ఐక్యవేదికను మొట్టమొదటిసారిగా ములుగు జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగింది .ఈ సంఘం అన్ని జిల్లాలలో విస్తరింప చేసి సంఘాలకు అతీతంగా ఉమ్మడిగా కార్యాచరణలు తీసుకొని ముందుకు పోవడం ఈ సంఘం యొక్క ముఖ్య ఉద్దేశం..ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏకలవ్య ఎరుకల ఐక్యవేదిక సంఘం మండల అధ్యక్షులుగా ఎన్నికైన సముద్రపు జగదీష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఇంత గొప్ప బాధ్యతను అప్పగించిన జిల్లా అధ్యక్షులు పాలకుర్తి సమ్మయ్యకి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను, నేను నా ఎరుకల జాతి ప్రగతి కోసం ఐక్యత కోసం, ప్రతిక్షణం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.. జై ఏకలవ్య, అని అన్నారు..ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ..



స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మన ఎరుకల జాతి అభివృద్ధికి ఎప్పుడు వెనకే ఉంది, దానికి మూల కారణం మనలోని ఐక్యత లోపించి విచ్ఛిన్నమైన జీవితాలను జీవించడమే అందరితో సమానంగా ఈ సమాజంలో మనం అభివృద్ధిలో గాని, రాజకీయంగా గాని ,ఆర్థికంగా గాని సామాజికంగాని, ముందుకు సాగాలంటే మనం ఎప్పుడు ఐక్యంగానే నిలబడాలి మన హక్కుల కోసం, మన అభివృద్ధి కోసం, ఐక్యంగానే పోరాడాలి, ఐక్యతే మహాబలం జై ఏకలవ్య అని ఆయన అన్నారు, ఈ కార్యక్రమం తదుపరి మండల మహిళా సంఘాన్ని కూడా పాలకుర్తి సమ్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసి వారికి సంఘం యొక్క విధివిధానాలను తెలియజేయడం జరిగింది ఐక్యంగా పోరాడాలి ,ఐక్యంగా నిలవాలి ,ఐక్యంగా జీవించాలి, ఐక్యంగా అభివృద్ధి సాధించాలి, అని వారు అన్నారు ,మండల అధ్యక్షురాలుగా అంగిడి నాగలక్ష్మి ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా కోట లలిత ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మేడ సాయిలు, అంగిడి వెంకన్న, అంగిడి సమ్మయ్య, అంగిడి సురేష్, సముద్రపు నాగరాజు, సముద్రపు సారయ్య, మేడ సమ్మయ్య, అంగిడి శీను, మేడ బుర్రయ్య, మేడ వంశీ, మేడ నాగసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి నిరసిస్తూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



కోదాడ, ఏప్రిల్ 27 శుభోదయం న్యూస్ : కులమతాలకతీతంగా 140 కోట్ల మంది భారతీయులు ఏకత్రాటిపై నిలబడి పాకిస్తాన్ ఉగ్రవాద కిరాతక చర్యలను ఖండించాలని పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పిలుపునిచ్చారు. పహెల్గాం లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలైన వాసవి క్లబ్స్ అవోపా సభ్యులతో ఆదివారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా థియేటర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ భారతదేశ పై కుట్రపూరిత దాడులు నిర్వహించినంతమాత్రాన భారత్ బెదిరేది లేదని, ఉగ్రవాద చర్యలను, కుట్రలను దిప్పిగొడతామన్నారు భారత్ పై నిర్వహించే కుట్రపూరిత దాడులతో తానే నష్టపోతుంది తప్ప దాయాది దేశం సాధించేదేమీ లేదన్నారు. భారతీయులందరూ కుల మతాలకు అతీతంగా భారత్ పై జరిగే కుట్రలను ఖండించాలన్నారు. భారతదేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరించే ఏ విధానానికైనా పార్టీలతో సంబంధం లేకుండా తాము మద్దతిస్తామన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష కార్యదర్శులు పైడిమర్రి నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సత్యనారాయణ, సంఘ నాయకులు పైడిమరి సత్యబాబు, ఓరుగంటి ప్రభాకర్ ,గారిని శ్రీధర్, పైడిమర్రి వెంకటనారాయణ, చలా ప్రకాష్ రావు, ఇరుకుల్ల చెన్నకేశవరావు ఇమ్మడి రమేష్, యాద సుధాకర్, రాయపూడి వెంకటనారాయణ, ఓరుగంటి కిట్టు, యాద రమేష్, వంగవీటి శ్రీనివాసరావు, జనార్ధన్, బెలిదే భరత్, ఇమ్మడి అనంత చక్రవర్తి, వంగవీటి భరత్ చంద్ర ,వాసవి క్లబ్ బాధ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## : శ్రీరామచంద్ర మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం



కోదాడ, ఏప్రిల్ 27 శుభోదయం న్యూస్: శ్రీరామచంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరంను ఆదివారం అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నందు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని హాస్పటల్ నిర్వాహకులు శెట్టి వెంకటేశ్వర్లు ,శెట్టి రవికుమార్ లు ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ. శ్రీ రామచంద్ర పాలి క్లినిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సేవలు అభినందనీయమని కొనియాడారు వారు కోదాడ పరిసర ప్రాంతాలలో అనేక ఉచితవైద్య శిబిరాల ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ముందు ముందు కూడా వారి సేవలు పేద ప్రజలకు అందించాలని కోరారు శాంతినగర్ లో నిర్వహించే ఉచిత సేవ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని మంచి అనుభవం ఉన్న వైద్యులు వద్ద చూయించుకోవాలని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ మాజీ సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి, డాక్టర్లు కోల యశ్వంత్ కుమార్, డాక్టర్ ఇండ్ల స్వప్న, డాక్టర్. కోల ప్రవీణ్ కుమార్, కోల కొండలు వైద్య సిబ్బంది గ్రామ పెద్దలు బద్దం భద్రారెడ్డి, గునుకుల గోపాల్ రెడ్డి బద్దం పుల్లారెడ్డి చీకుల లక్ష్మారెడ్డి ,,బద్దం వెంకటరెడ్డి, సురభి చిన్న, నీలం నాగభద్రం తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల పునిత్ హాస్పిటల్ నందు అత్యాధునిక ల్యాబ్ ను ప్రారంభించిన రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేట్ నందు గల ప్రముఖ వైద్యులు డాక్టర్. వి.అనిల్ కుమార్ మరియు డాక్టర్.వి హరిత ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తిరుమల పునీత్ హాస్పిటల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పాల్గొని తన చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో మొట్టమొదటి చెవి ముక్కు గొంతు హాస్పిటల్ ప్రారంభించింది అనిల్ కుమార్ తాతయ్య తిరుమల చారీ అన్నారు, వారి మార్గంలోనే వారి కుమారులు సత్యనారాయణ వారి మనవడు అనిల్ కుమార్ నంద్యాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. డాక్టర్ అనిల్ కుమార్ తన కుమారుడు లాంటివాడేనని ఈ సందర్భంగా వారి దంపతులు వైద్యరంగంలో మరి ఇంకా రాణించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నంద్యాలలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని నంద్యాల ప్రజలకు వీడియో మైక్రోస్కోప్ ద్వార త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేసి ఇన్ఫెక్షన్ సోకకుండా చికిత్స చేయడానికి ఈ అత్యాధునిక ల్యాబ్ ఎంతో ఉపయోగపడతుందని నంద్యాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు మధుసూదన్ రావు , జూన్ 3 వైస్ ప్రెసిడెంట్ ఐఎంఏ స్టేట్ విజయ్ భాస్కర్ రెడ్డి , స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి , డాక్టర్ సహదేవుడు , డాక్టర్ బాబాన్ , న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సునీత , రోటరీ ప్రెసిడెంట్ ఎన్ సీ మోహన్ రెడ్డి , రోటరీ పిడిజి కల్లూరు రామలింగారెడ్డి , రోటరీ పిడిజి చేన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.






నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా మంత్రి ఎన్ఎండి ఫరూక్ , మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు . అనంతరం గోస్పాడు , నంద్యాల రైతులకు విత్తనపు గొర్రు, రోటవేటర్లు తైవాన్ స్ప్రేయర్లు ,బ్యాటరీ స్ప్రేయర్లు కల్టివేటర్లు రైతులకు అందజేశారు. భవిష్యత్తులో రైతులకు రాయితీపై మరిన్ని యంత్ర పరికరాలు అందిస్తామన్నారు. అలాగే జొన్నలకు కొనుగోలు కేంద్రం ని కూడా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, నంద్యాలఏడిఏ రాజశేఖర్ , సివిల్ సప్లై డిఎం రాజు నాయక్, మార్క్ఫెడ్ డిఎం హరినాథ్ రెడ్డి, గోస్పాడు ఏవో స్వప్నికా రెడ్డి , నంద్యాల ఏవో ప్రసాద్ రావు, నంద్యాల గోస్పాడు మండల ఏఈవోలు, అగ్రికల్చర్ , అసిస్టెంట్లు , టిడిపి గోస్పాడు మండల కన్వీనర్ తులసి రెడ్డి , నంద్యాల మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి , డీసీ చైర్మన్ చాబోలు ఇలియాస్ , నంద్యాల ఎంపీపీ ప్రభాకర్ మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రారంభం కానున్న గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం!



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం నేటి నుండి ప్రారంభిస్తున్నట్టు స్థానిక గ్రంథాలయ నిర్వాహకులు గుమ్మడి వర్ధన్ రాజు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం నేటి నుండి ఈ ఏడాది జూన్ 6 వరకు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా విద్యార్థుల్లో విజ్ఞానాన్ని సృజనాత్మకతను పెంపొందించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు డ్రాయింగ్ పెయింటింగ్ స్పోకెన్ ఇంగ్లీష్ కథలు చెప్పించడం చదివించడం వంటివి ఉచితంగా నేర్పించడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చుటకు ఆసక్తిగల ఉపాధ్యాయులు ఫ్యాకల్టీలు ముందుకు రావాలని కోరుతున్నామన్నారు.

## మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చింతపల్లి హరిబాబు!



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- మాజీ మంత్రి వైసిపి రాష్ట్ర పీఏసీ సభ్యులు కొండపి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదినోత్సవం సందర్భంగా టంగుటూరు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపల్లి హరిబాబు ఆదివారం ఆయనను కలసి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## ఆకుపాటి పొంగళ్ళు వేడుకలో పాల్గొన్న ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు అభిమానులు



పామూరు మండలం రిపోర్టర్ బండి రమేష్ ( శుభోదయం న్యూస్): వల్లూరమ్మ దేవస్థానంలో పొంగళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎంపీటీసీలు సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ తదుపరి పలువురు నాయకులు ఆకుపాటి వెంకటేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కంది రవిశంకర్, సిఐడి డి.ఎస్.పి ధనుంజయుడు ,ఒంగోలు మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శీనన్న, ఒంగోలు మాజీ ఏఎంసి చైర్మన్ ఘన శ్యామ్ , ఫైర్ బ్రాండ్ గొర్రెపాటి శీనన్న , అక్షోభ్య డెవలపర్స్ బాలిశెట్టి నాగేశ్వరరావు, జనసేన పార్టీ కనిగిరి నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికూటి నాగరాజు ఒంగోలు జనసేన పార్టీకార్పొరేటర్ నగర అధ్యక్షులు మలగా రమేష్ ,రాష్ట్ర కాట్వా నాయకులు, పారిశ్రామికవేత్త గాజుల రాము, డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ శ్రీనాథ్, ప్రజాశక్తి పశ్చిమ ఇన్చార్జి వివేక్, వల్లూరమ్మ దేవస్థానం ఈవో రమేష్, సూర్య బ్యూరో గొట్టిపాటి నాగేశ్వరరావు, ఫైర్ బ్రాండ్ ఆమంచి రాజేంద్ర, చిరంజీవి యువత అధ్యక్షులు అడుసుమల్లి వెంకటరావు, సీనియర్ నాయకులు కోలా ప్రభాకర్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు కోనపురెడ్డి శివశంకర్, ఉపాస్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పి శ్రీనివాసరావు, డాక్టర్ ఏ శ్రీనివాసరావు, డాక్టర్ పవన్ కుమార్, సాయి శశిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ డాక్టర్ కిరణ్మయి, ఆడిట్ అసోసియేషన్ సభ్యులు ఎం వెంకటేష్, ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రమణయ్య, ప్రకాశం జిల్లా కేఆర్ అడ్మిన్ రామ్మోహన్, కందుకూరు కళ్యాణ్ మిత్రబృందం, చైతన్య రెడ్డి, రమణారెడ్డి, ఇరిగేషన్ అధికారి ,డి శ్రీనివాసరావు రమణారావు, పలువురు అడ్వకేట్స్ పలువురు కళాశాలల కరస్పాండెంట్లు, పలువురు సబ్ ఇన్స్పెక్టర్లు, రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన జిల్లా నుంచి నలుమూలల పాల్గొన్న ఆకుపాటి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి గన్నవరం విమానాశ్రయంలో బీజేపీ నేతల సాదరస్వాగతం



గన్నవరం నియోజకవర్గం ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): రాజ్యాంగ నిర్మాత -భారతరత్న డా. భీమ్రావ్ అంబేద్కర్ గారి జయంతి వేడుకలు సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సుకు ముఖ్య అతిధిగా విజయవాడకు విచ్చేసిన కేంద్ర మంత్రివర్యులు శ్రీ గంగాపురం కిషన్ రెడ్డి గారికి గన్నవరం విమానాశ్రయంలో సాదరస్వాగతం పలికి బీజేపీ స్టేట్ మీడియా ఇన్ ఛార్జ్, మరియు మాజీ జిల్లా పరిష్యత్ చైర్మన్ శ్రీ. పాతూరి నాగభూషణం, శ్రీ. సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, వల్లూరు జయప్రకాష్, ఆర్డీ విల్సన్, షేక్ భాజీ, కుమారస్వామి, దేవానంద్ , శ్రీనివాసరాజు, పీయూష్ దేశాయ్, వెంకట సుబ్బయ్య, వెంకటకృష్ణ శేషు కుమార్.రాజశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డు సాధించిన గన్నవరంకు చెందిన అన్నా, చెల్లెలు





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్ ): గన్నవరం కృష్ణా జిల్లాకు చెందిన పి. కిషోర్, సుజాత దంపతుల కొడుకు మేధాన్ష్, కుమార్తె మనోజ్ఞ రోజలిండ ఆన్లైన్ బృంద సంగీత ప్రదర్శన లో మ్యూజికల్ కీబోర్డ్ వాయిద్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. హలేల్ మ్యూజిక్ స్కూల్ ఆగస్టిన్ దండంగి గారి శిక్షణ సారథ్యంలో 18 దేశాల నుండి 1046 మంది కీబోర్డ్ వాయిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్లో స్థానం దక్కించుకున్నారు. ప్రపంచ రికార్డు నెలకొల్పిన పి. మేధాన్ష్, మనోజ్ఞ రోజలిండ ను గిన్నిస్ ప్రతినిధులు ఆగస్టిన్, సత్కరించారు.



## ప్రజల వినతి పత్రాలను స్వీకరించిన మంత్రి స్వామి



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదివారం కొండపి నియోజకవర్గం పరిధిలోని ప్రజల నుండి పెద్ద సంఖ్యలో వినతి పత్రాల స్వీకరణ గాలించడం జరిగింది. మండల పరిధిలోని తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా వినతి పత్రాల సమస్యలను సంబంధిత అధికారులతో సమీక్షించి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## పెనుకొండ కోర్టు భవనాలను పరిశీలించిన జిల్లా జడ్జి భీమరావు



శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్ ) : జిల్లా పరిధిలోని పెనుకొండ కోర్టు భవనాల జిల్లా జడ్జి భీమ్ రావు పరిశీలించారు. జిల్లాలోని కోర్టుల పరిశీలన పర్యటనలో భాగంగా జిల్లా జడ్జి భీమ్ రావు ఆదివారం పెనుకొండకు వచ్చిన సందర్భంగా ముందుగా పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహలకు చేరుకోగా అక్కడ పెనుకొండ న్యాయమూర్తులు మరియు న్యాయవాదులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తికి ఏజీపీ ఎం.భాస్కర్ రెడ్డి మరియు పెనుకొండ న్యాయవాదులు. కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డిఓ ఆనంద్ కుమార్, తహసీల్దార్ శ్రీధర్ తదితర అధికార యంత్రాంగం వారికి మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు.

## గంగమ్మ గుడి వద్ద త్రుటిలో తప్పిన ప్రమాదం....




పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ శీనివాసరావు (శుభోదయం నూస్): పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్నంలోని శ్రీ గంగమ్మ తల్లి దేవాలయం వద్ద ఈరోజు కొద్ది రేపటి క్రితం మద్యం సేవించిన వ్యక్తి ఆటో నడుపుతూ గంగమ్మ తల్లి దేవాలయం ముందు ఉన్న ఇనుప రాడ్లకు సైతం ఢీకొనడంతో అక్కడ ఎవరు భక్తులు లేకపోవడం తృటిలో తప్పిన ప్రమాదం.

## : నిడిమామిడిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అలనాటి జ్ఞాపకాలతో ఆనందం పంచుకున్న 1999 సం"10 తరగతి బ్యాచ్



శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్): పుట్టపర్తి మండలం నిడిమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999 సంవత్సరంలో 10వతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిడిమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ నాగపద్మజ అధ్యక్షతన ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఒక్కొక్కరు పరిచయం చేసుకుంటూ తమ పేరు ఊరు ప్రస్తుతం వారు పనిచేస్తున్న వివరాలు తెలియపరుస్తూ కుటుంబ స్థితిగతులను వివరించారు. అలనాడు చేసిన అల్లరి గురించి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యార్థిని సుభాషిణి మాట్లాడుతూ ఆనాడు ఉపాధ్యాయులు మాకు నేర్పిన క్రమశిక్షణ తో మేము లక్ష్యాలను నిర్దేశించుకుని చదివి మంచి స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ఆమె ఆర్మీలో పనిచేసిన తీరు అక్కడ ఎదుర్కొన్న సమస్యలు తన తోటి సైనికులు మృతి చెందిన తీరు కళ్ళకు కట్టినట్లు తెలపడంతో అందరి కళ్ళు చమర్చాయి. ఆర్మీ నుండి రిటైర్డ్ అయ్యి నేడు పాలసముద్రం వద్ద సప్తగిరి రెస్టారెంట్, కియా అనుబంధ సంస్థలకు మ్యాన్ పవర్ సప్లై ఏజెన్సీ, బస్సుల నిర్వహణతో మంచి స్థాయిలో ఉన్నానని తెలిపారు. ఇదే బ్యాచ్ కి చెందిన పెనుకొండ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి (మదన్) మాట్లాడుతూ 1999లో 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు అందరం ఒకచోట కలవడం అందరిని కలుపుటకు మాలో కొందరు ముందుండి అందరిని ఒక చోటకు తీసుకురావడం వారు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కలయిక ఎంతో ఆనందాన్ని



ఇచ్చిందని తెలిపారు. పుట్టపర్తి మండలం కోట్లపల్లి సర్పంచ్ కుల్లాయి రెడ్డి మాట్లాడుతూ తన చిన్నప్పుడు నిర్ణయించుకున్న లక్ష్యం చేరుకున్నానని నేను రాజకీయ నాయకుడు కావాలని అనుకున్నానని ఆ లక్ష్యాన్ని కొద్దిగా ఆలస్యమైనా లక్ష్యాన్ని చేరుకున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు,దాదాపు 35 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పలువురు మాట్లాడుతూ అందరూ కలిసి ఒక చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మనలో ఆర్థికంగా వెనకబడి, సమస్యల్లో ఉన్నవారిని అవసరాన్ని బట్టి ఆదుకోవాలని తీర్మానించారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూలమాలలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవం వేడుకలు

## బిఆర్ఎస్ పార్టీ నముతాబాద్ కిరణ్ జీ ఆధ్వర్యంలో




గోదావరిఖని టౌన్ రిపోర్టట్-సురేష్,(శుభోదయం న్యూస్) గోదావరిఖనిలోని 31 డివిజన్ మేదరిబస్తీలో నామతాబాద్ కిరణ్ జీ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ ఆదేశాలమేరకు ఘనంగా బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవం సందర్భంగా ఘనంగా పండుగల నిర్వహించడం జరిగినది. అదేవిధంగా కేక్ కటింగ్ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున 31వ డివిజన్ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## ఇంటర్ లో ఉత్తమ మార్కులు సాధించిన బర్వెల్లి మానస కు సన్మానం.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం బీర్కూర్ గ్రామానికి చెందిన బర్వెల్లి దత్తు, అంజవ్వ గార్ల చిన్న కుమార్తె అయినటువంటి బర్వెల్లి మానస అనే విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాల బీర్కూరులో చదివి రాష్ట్రస్థాయి మార్కులైనటువంటి 928 మార్కులు సాధించినందుకుగాను బహుజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ విద్యార్థిని సన్మానించి చిరు జ్ఞాపికను అందించి, నగదు బహుమతి ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బహుజన ఉద్యోగుల సంఘం బాధ్యులైనటువంటి క్యాకయ్య సార్ గారు, దండు సాయిలు సార్ గారు,మహేష్ సార్,సతీష్ సార్, సుధాకర్ సార్, రాచయ్య సార్, పీరయ్య సార్ పాల్గొన్నారు

## భాజపా మండల మరియు బూత్ కమిటీ లు ఏర్పాటు చెయ్యాలి - నాగేళ్ల సాయికిరణ్..




బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):బిజెపి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఈ రోజు బీర్కూర్ మండల బిజెపి పూర్తి మండల కమిటీ, అలాగే పూర్తి బూత్ కమిటీ లు వేయాలి అని బిజెపి నాయకులతో , కార్యకర్తల తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నాగేళ్ల సాయి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెలా యోగేష్, బిజెపి సీనియర్ నాయకులు హన్మాన్లు, సాయిలు, సాయిబాబా, రాము, విఠల్, పండారి కార్యకర్తలు శ్రావన్, బాబు గోండ, ఉప్పు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ సభకు భారీ ఎత్తున తరలిన బీర్కూర్ భారస నాయకులు




బీర్కూరు, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):నేడు జరగబోయే బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో భారీ జనసందోహం లో ఏర్పాటు చేయడం జరిగింది అని ఈ కార్యక్రమానికి బీర్కూరు మండల పార్టీ నాయకులు కేసీఆర్ అభిమానులు పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలి వెళ్లినట్టు బీర్కూర్ మండల నాయకులు తెలిపారు ఈ కార్యక్రమం లో మేకల రాములు, గొల్ల సాయిలు,గొల్ల రాజు,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిన ఊరుకొండ గ్రామస్తులు




తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): ఈరోజు ఊరుగొండ లొ సిల్వర్ జూబ్లీ భారీ బహిరంగ సభ కు బి ఆర్ ఎస్ కార్యకర్తలు భారీ ఎత్తున జెండా ఎగరవేసి వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు స్వచ్ఛందంగా బయలుదేరడం జరిగింది కూనటి సునీల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు అవుతున్న రైతులకు రుణమాఫీ గాని రైతు భరోసా గాని వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఉద్యోగ భృతి ఇవ్వడంలో విఫలమైందని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు గతంలో కెసిఆర్ చేసిన అభివృద్ధి బాగుందని మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజానికం కోరుకుంటుంది గ్రామ అధ్యక్షులు ఆధ్వర్యంలో బయలుదేరారు. ఈ కార్యక్రమం లొ మాజీ సర్పంచ్ గోగుల సత్య నారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసి మల్లాడి మల్లా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జన్ను విద్యా సాగర్,మాజీ వార్డ్ సభ్యులు,గొల్ల పెల్లి కొమురయ్య, జన్ను కమలాకర్, జన్ను విజయ్,లక్కిడి లక్ష్మణ్ నల్ల భద్రయ్య, నాయకులు జన్ను సాంబయ్య, పోలేపాక లక్ష్మి నారాయణ, జన్ను సుమన్, జన్ను రమేష్, నల్ల రాజు, పోలేపక రాజు, సాంబారి నరేష్, రాకేష్, వేణు, ఇట్టబోయిన శ్రీను, రాగిడి కిరణ్ రెడ్డి,ఖాలీద్ తదితరులు ఈ కార్యక్రమం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజువ యువ వికాస్ కు అప్లికేషన్ చేసుకున్న అభ్యర్థులు 1152 మంది

నర్వ మండల కేంద్రంలో వివిధ గ్రామాల నుండి రాజు యువ వికాస్ కు అప్లై చేసుకున్న అభ్యర్థులు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజు యువ వికాస్ స్వయం ఉపాధి పథకం లో భాగంగా నిరుపేదలైనటువంటి జీవనోపాధి కింద గాను రాజు యువ వికాస్ అప్లికేషన్ చేసుకున్న అభ్యర్థులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ. అభ్యర్థులు 1152 మంది అభ్యర్థులు అప్లికేషన్ చేసుకోవడం జరిగిందని నర్వ ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా కొందరు అప్లికేషన్ చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫామ్స్ వారి దగ్గరనే ఉంచుకోవడం జరిగింది. కావున అభ్యర్థులు అతి త్వరలో వారి దగ్గర ఉన్న అప్లికేషన్ ఫామ్స్ ఎంపీడీవో ఆఫీస్ లో సబ్మిట్ చేయాలని ఎంపీడీవో అభ్యర్థులకు తెలియజేశారు. ఆన్లైన్ లో చూపించేవి 1152 అయితేఎంపీడీవో ఆఫీసులో 25/04/2025 రోజు వరకు ఆఫీస్ లో 880సబ్మిట్ అయినవి .మిగతా అభ్యర్థులు అప్లికేషన్ ఫామ్స్ వారి దగ్గర ఉంచుకోవడం జరిగింది.అతి త్వరలో ఎంపీడీవో ఆఫీస్ లో అప్లికేషన్ ఫామ్స్ సబ్మిట్ చేయాలని ఫోన్ ద్వారా అభ్యర్థులకు తెలియజేస్తున్నామన్నారు. ఇంటర్వ్యూకు మాకు పై ఆఫీసర్స్ నుండి ఆర్డర్స్ వస్తే ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని నర్వ ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

## సర్వే రిపోర్టు లేకపోవడం వల్లే మాలీల ఎస్టీ హెూదా అంశం పెండింగ్లో ఉంది -ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కొట్రంగి రమేష్.మాలిలకు ఎస్టీ హెూదా కల్పిస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు కేంద్రానికి ఆమోదం కోసం పంపిన విషయం వాస్తవమే. అయినప్పటికీ మొదటిసారి గిరిజన రిజర్వేషన్ల పెంపును ముస్లిం రిజర్వేషన్ల బిల్లుతో ముడి పెట్టడం వల్ల ఆలస్యమైందని, రెండవసారి పంపిన బిల్లులో మాలి కులస్తుల సమగ్ర సర్వే కమిషన్ రిపోర్ట్ జత చేయక పోవడం వల్ల అది కేంద్ర ప్రభుత్వం వల్ల పెండింగ్లో ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గత రాత్రి క్యాంపు కార్యాలయంలో అఖిల భారత మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే, ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మాలీల ఎస్టీ హెూదా విషయంలో కేంద్రాన్ని ఒప్పించి త్వరగా ఎస్టి హెూదా కల్పించి 25 ఏళ్ల మాలీల పోరాటానికి ముగింపు పలకాలని కోరగా, ఇందులో కేంద్రం తప్పేమి లేదని, రాష్ట్ర ప్రభుత్వం సరైన సర్వే రిపోర్టు పంపకపోవడం వల్లనే ఆ బిల్లు కేంద్రం వద్ద పెండింగ్లో ఉందని, త్వరలో ముఖ్యమంత్రిని కలిసి ఈ విషయమై మాట్లాడి మాలిల ఆచార వ్యవహారాలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య ఉద్యోగ స్థితిగతులపై సర్వే చేయించడానికి కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతానని, ఆ కమిషన్ నివేదిక ఆధారంగానే కేంద్రంతో మాట్లాడి మాలీల ఎస్టి హెూదా విషయం పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని, మాలి మహా సంఘం మరియు మాలి ఎంప్లాయిస్ యూనియన్ నేతలతో అన్నారు. ఈ కార్యక్రమంలో మాలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చంద్రశేఖర్, అంబేకర్, భాస్కర్ ప్రధాన్ లతోపాటు తదితర నేతలు ఉన్నారు.

## చలో.. చలో.. వరంగల్.. గ్రామ గ్రామాల నుంచి కదిలిన గులాబీ దండు..

వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో ఆదివారం జరుగుతున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు దేవరకద్ర మండలం నుంచి గులాబీ దళపతిలు వరంగల్ కు బయలుదేరి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బి ఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పాత బస్టాండ్ వద్ద మండల పార్టీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి వాహనాల ద్వారా పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు వరంగల్ జిల్లాకు బయలుదేరి వెళ్లారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గ్రామ కమిటీ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి చలో చలో వరంగల్ అంటూ గ్రామ గ్రామం నుంచి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు గులాబీ దండు కదిలి వెళ్ళింది. జై కేసీఆర్.. జై జై కేసీఆర్.. జై ఆ ల జై జై ఆల అంటూ.. కార్యకర్తలు నినాదాలు చేశారు. వరంగల్ జిల్లాకు బయలుదేరిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్ బాలరాజ్ ఆంజనేయులు కర్ణం రాజు భాస్కర్ రెడ్డి రవీందర్ రెడ్డి అడ్డు పాషా కొండారెడ్డి భార్గవ్ యాదయ్య మెకానిక్ ఆంజనేయులు రాజు ఆంజనేయులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..

దేవరకద్ర మండల కేంద్రంలో స్థానిక కురువ వాడలో ఆదివారము మున్సిపాలిటీ సిబ్బంది వారు ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు. ధన్వాడ మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైప్లైన్ పనులు జరుగుతున్నందుకు ఈ వాడలో మూడు రోజుల నుంచి నీటి కోసము ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు ట్యాంకర్లను ఏర్పాటు చేసి వాడ వాడకు నీటి సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల దగ్గర కూడా నీటి కోసము మహిళలు పిల్లలు దోబూచులాడుతున్నారు. ట్యాంకర్ల దగ్గర కూడా మహిళలు కడ వలతో నీటి కోసము కబాడీ ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకొని దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ కేంద్రంలో నీటి సమస్య లేకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..జిల్లా కలెక్టర్



:నేడు అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సాప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ ఎమ్మెల్యే వై.అంజ య్య యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వరంగల్ కు తరలి వెళ్ళిన గులాబీదండు

:షాద్ నగర్ వరంగల్ కు నియోజకవర్గ దండు కదిలింది. మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు,నాయకులు, అభిమానులు వరంగల్ సభకు బారులు తీరారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవల్లో భాగంగా వరంగల్ ఎల్కుర్తిలో నిర్వహిస్తున్న సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. 60 ప్రత్యేక బస్సుల్లో, 310 కార్లలో తోపాటు ఇతర వాహనాలలో గులాబీ శ్రేణులు సభకు వెళ్లారని చెప్పారు. ఊహించని స్థాయిలో స్వచ్ఛందంగా పార్టీ అభిమానులు, కెసిఆర్ అభిమానులు సభకు తరలిరావడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. కేశంపేట, కొందుర్గు, చౌదరి గూడెం, కొత్తూరు, నందిగామ, ఫారుక్ నగర్ మండలాలలోని ప్రతి పల్లె నుంచి కార్యకర్తలు సభకు తరలివచ్చారని, రజతోత్సవ సభ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని మరోమారు నిలిపే విధంగా నిలుస్తుందని చెప్పారు. సభకు తరలి వెళ్లిన వారిలో అన్ని గ్రామాల కార్యకర్తలు,నాయకులు, అభిమానులు ఉన్నారు.

## షాద్ నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

షాద్ నగర్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన పార్టీ, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన పార్టీ, సకలజనులకు సంపూర్ణ సంక్షేమాన్ని అందించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని పార్టీ కార్యాలయ ఆవరణలో గులాబీ జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ ప్రజల చిరకాల వంచను నెరవేర్చి, ప్రత్యేక రాష్ట్రాలు సాధించిన ఘనత విఆర్ఎస్ పార్టీకి దక్కిందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. స్వరాష్ట్రంలో కెసిఆర్ పాలనలో అభివృద్ధిలోనే రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని అన్నారు. కెసిఆర్ పాలన తీరు దేశానికి ఆదర్శంగా నిలిచిందని, సకలజనులకు సంక్షేమ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, బీసీ బందు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కెసిఆర్ కిట్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు పేద ప్రజల అభివృద్ధికి దోహదపడ్డాయని అభిప్రాయపడ్డారు. కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. టిఆర్ఎస్ పార్టీ అంటేనే తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ అని, ఎప్పటికైనా తెలంగాణ ప్రజల బాగోగులను చూచే ఏకైక పార్టీ గులాబీ పార్టీ అని అన్నారు. తెలంగాణ ప్రజల పార్టీ రజతోత్సవ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని, రజతోత్సవాన్ని తెలంగాణ ప్రజలు పండుగల భావిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే వరంగల్లో నిర్వహిస్తున్న రజోత్సవ వేడుకలకు నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. సభకు వెళ్తున్న వాహనాలకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జెండాను ఊపి స్వాగతం పలికారు. ప్రతి పల్లె నుంచి గులాబీ దండు వరంగల్ సభకు తరలివచ్చారని ఈ సందర్భంగా పలువురు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చలో వరంగల్ కేటీఆర్ సేన రంగరెడ్డి జిల్లా ఇంచార్జ్ జె.విజ య్ కుమార్

:కొందుర్గు భారత రాష్ట్ర రజతోత్సవ సందర్భంగా కొందుర్గు మండలం చెక్కలోని గూడ కూడ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ చలో వరంగల్ సభకు కేటీఆర్ సేన రంగరెడ్డి జిల్లా ఇంచార్జ్ జె.విజ య్ కుమార్ జెండా ఆవిష్కరణ చేసి బయలు దేరారు వారివెంట బయలు ధేరినవాళ్ళు తెలంగా ణ రాష్ట్ర వైస్ కార్యదర్శి జంగ య్య ఎల్ శంకర్ జి జంగయ్య జీ వెంకయ్య యస్ నర్సింలు జి రాధాకృష్ణ సి నరేష్ ఎస్ యాదయ్య ఈ నర్సింలు జి వేంకటయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## : "చలో వరంగల్" కేటీఆర్ వెంటే ఎమ్మెల్యే నాగర్ కుంట నవీన్‌రెడ్డి

:రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ లోని ఎల్కతుర్తి లో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్తున్న సందర్భంగా గన్ పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద మరియు ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి విగ్రహానికి నివాళు లర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు మరియు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు,ఎంపీలు,ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి మరియు పార్టీ నాయకులు తదితరులు నివాళులర్పించి వరంగల్ కి బయలుదేరారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కాశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడికి నిరసన

):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మ పేటమండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కాశ్మీర్లో జరిగినటువంటి ఉగ్ర దాడికి నిరసన సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మా మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పెహల్ గం లో టూరిస్టులపై జరిగినటువంటి ఉగ్ర దాడిలో అమాయక ప్రజలపై కాల్పులు జరిపి పాకిస్తాన్ తన వక్ర బుద్ధి చూపించింది 150 కోట్ల పైచిలుకు ప్రజలు నివసిస్తున్నటువంటి భారతదేశంలో హిందువులు ముస్లింలు అన్నదమ్ముల్లాగే నివసిస్తుంటే పి రికిపంద పాకిస్తాన్ తన ఉగ్రముఖను ఉ సిగొలిపి అమాయకమైనటువంటి ప్రజలను క్రూరాతి క్రూరంగా హింసించి పొట్టణ పెట్టుకున్నారు ఎదురుగా ఢీకొనే శక్తి లేక పిరికిపందలాంటి చర్యలకు పాల్పడుతుంది ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నటువంటి పాకిస్తాన్ కు తగిన బుద్ధి చెప్పాలని చనిపోయినటువంటి భారతదేశ పౌరులకు అమరాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మన భారత దేశ రక్షణ రంగం ఇండియన్ ఆర్మీ ఇండియన్ నేవీలు ఉగ్రముఖల్ని తుది ముట్టించి చేతకాని దద్దమ్మ పిరికిపంద దుర్మార్గ దుశ్చర్యలకు పాల్పడుతున్న పాకిస్తాన్ కు చమరగీతం పాడాలని వారన్నారు ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి లు బత్తుల సాయి యార్లగడ్డ మణికంఠ లక్ష్మీనారాయణ రాము శ్రీమన్నారాయణ ప్రసాదు జాన్ బి తదితరులు పాల్గొన్నారు

## ఎస్సై పై పిర్యాదు చేస్తే చర్యలు తీసుకోరా! పేరు పక్కన తోక లేకపోతే న్యాయం జరగదా? ఎవరి అండతో బహుజన నాయకులను బెదిరిస్తున్నరు? బీఎస్పీ నాయకుడిని బెదిరించిన ఉట్కూర్ ఎస్సై పై జిల్లా ఎస్పీకి పిర్యాదు! చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తాం! బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్

బీఎస్పీ నాయకుడిని బెదిరించి,ఘోరమైన అవమానానికి గురి చేసి మొబైల్ ఫోన్ లాక్కున్న ఉట్కూర్ ఎస్సై కృష్ణం రాజు పై జిల్లా ఎస్పీ కి పిర్యాదు చేస్తే ఇప్పటి వరకు విచారణ జరిపి చర్యలు తీసుకోకపోవడమేంటని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు (ఎమ్మెల్యే అభ్యర్థి) బొదిగెలి శ్రీనివాస్ ప్రశ్నించారు.ఆధివారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం ఓ కేసు విషయంలో బాధితుని తరపున మాట్లాడటానికి పోలీస్ స్టేషన్ కు వెళ్తే అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై ఒక జాతీయ పార్టీకి చెందిన మా పార్టీ మండల నాయకుడిని బెదిరింపులకు పాల్పడి మొబైల్ ఫోన్ లాక్కుని అవమాన పరిచి కేసు నమోదు చేస్తామని బెదిరించాడని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ కి పిర్యాదు చేసినా ఇంతవరకు ఎందుకు విచారణ జరిపి చర్యలు తీసుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ రెడ్డి పాలనలో బహుజన కులాల ప్రజలకు న్యాయం జరగధా అంటూ ప్రశ్నించారు.తక్షణమే ఉట్కూరు ఎస్సై పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తక్షణమే చర్యలు తీసుకోకపోతే డీజీపీ కి పిర్యాదు చేసి కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

# టపాకాయల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

టపాకాయల దుకాణాలు వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టపాకాయల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు అన్నారు.ఉన్నతి అధికారుల ఆదేశాల మేరకు, వేసవికాలం దృష్టిలో ఉంచుకొని మండుతున్న ఎండలు దృష్ట్యా టపాసులు దుకాణం యజమానులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని శనివారం తొట్టంబేడు మండల పరిధిలోని పలు టపాసులు దుకాణాలను ఉమ్మడి తనిఖీలో భాగంగా పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి తనిఖీ అధికారులు వారు మాట్లాడుతూ నిబంధనలు మేరకు అన్ని రకాలు ప్రమాద నివారణ చర్యలు టపాసులు దుకాణాల యజమానులు తీసుకోవాలని హెచ్చరించారు . ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలని ఎండలో వేడికి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి జాగ్రత్త వహించాలని, ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తే తగు ప్రభుత్వపరమైన చర్యలు టపాసుల దుకాణాల యజమానులపై తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు . భద్రతకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని ఏదైనా అనుకోని ప్రమాదాలు సంబంధించినప్పుడు నష్ట నివారణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి లేబర్ ఆఫీసర్ జి రంగనాథ్, తొట్టంబేడు మండలం డిప్యూటీ తాసిల్దార్ జగన్మోహన్ , శ్రీకాళహస్తి ఫైర్ అధికారి ఎన్ నాగార్జున రెడ్డి మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పార్థసారధి పాల్గొనడం జరిగినది.

## భారత్‌పై దాడి కోసం 130 అణు బాంబులు..

### పాక్ మంత్రి సంచలన వ్యాఖ్యలు



ఇస్లామాబాద్: పాకిస్తాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగంగా బెదిరింపులకు దిగాడు. భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్తాన్ 130కి పైగా అణు ఆయుధాలతో పాటు ఘోరి, షాహీన్, ఘజ్నవి మిసైళ్ళను సిద్ధం చేసినట్లు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. రాక్షసత్వానికి పరాకాష్ఠగా నిలిచిన పహల్గాం ఉగ్రదాడిపై రగిలిపోతున్న భారత్ తన చర్యల ద్వారా దాయాదిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సింధూ నదీ జలాల నిలిపివేత, పాకిస్తాన్ జాతీయుల వీసాలు రద్దు, ఇతర వాణిజ్య సంబంధాలను నిలిపివేసింది. దీంతో ఏం చేయాలో పాలుపోక దీనంగా చూస్తోంది. ఈ క్రమంలో హనీఫ్ అబ్బాసీ భారత్‌ను కవ్వించే ప్రయత్నం చేశారు. భారత్ ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తే యుద్ధానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. యుద్ధం చేసేందుకు తాము సన్నంద్ధంగా ఉన్నామని, దేశ వ్యాప్తంగా అణు ఆయుధాల్ని సిద్ధం చేశామన్నారు. ఆ అణు ఆయుధాలు ప్రదర్శన కోసం కాదని, భారత్‌పై దాడి చేసేందుకేనని చెప్పారు. స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. 'నీటి సరఫరాను ఆపితే మనతో యుద్ధం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి. మన వద్ద ఉన్న సైనిక పరికరాలు, మిసైళ్ళు ప్రదర్శన కోసం కాదు. మన అణు ఆయుధాలు ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియదు. నేను మళ్లీ చెబుతున్నాను, ఈ బాలిస్టిక్ మిసైళ్ళు, అవన్నీ భారత్‌పై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అంతకుముందు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశం గత మూడు దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థల్ని పెంచి పోషించిందని ఒప్పుకున్నారు. దాని ఫలితమే ఈ దుర్భర పరిస్థితులకు కారణమని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.

## సరిహద్దుల్లో టెన్షన్..

## విధ్వంసక క్షిపణి పరీక్ష చేపట్టిన భారత్



ఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. భారత సరిహద్దుల్లో పాక్ ఆర్మీ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ కాల్పులు జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. వివరాల ప్రకారం.. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భారత నౌకాదళం సిద్ధమవుతోంది. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా.. ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ సిద్ధమని ప్రకటించింది. ఈ మేరకు క్షిపణి పరీక్షలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే, మూడు రోజుల క్రితమే భారత్ ఇదే సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎంఆర్-ఎస్ఏఎం)తో సీ స్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పేర్కొంటారు.

## ఢిల్లీలో ఎంత మంది పాకిస్తాన్ జాతీయులు ఉన్నారంటే..

### ఐబీ జాబితాలో షాకింగ్ గణాంకాలు..!



పహల్గాం దాడి ఘటన అనంతరం పాకిస్తాన్‌పై భారత్ కఠినంగా వ్యవహరిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో పాకిస్తానీలను స్వదేశానికి పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనేక రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ పౌరులను తిరిగి ఆ దేశానికి పంపే పనిలో పడ్డాయి. అయితే, దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 5వేల మంది పాకిస్తానీలు పౌరులు ఉన్నట్లుగా గుర్తించారు. భారత నిఘా విభాగం ఈ మేరకు జాబితాను ఢిల్లీ పోలీసులకు అందించింది. ఢిల్లీలో నివాసం ఉంటున్న 5వేల మంది పాకిస్తానీ పౌరుల జాబితాను ఐబీ ఢిల్లీ పోలీసులకు అందించి.. స్వదేశానికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నది. విదేశీయుల ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఈ జాబితాను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక శాఖకు అందించింది. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. జాబితాలో దీర్ఘకాలిక వీసాలు (%ూఎ%) కలిగి ఉన్న, మినహాయింపు పొందిన హిందూ పాకిస్తానీ జాతీయుల పేర్లు సైతం ఉన్నారు. ఈ జాబితా ధ్రువీకరణ కోసం సంబంధిత జిల్లా అధికారులకు అందించి.. వారంతా స్వదేశానికి తిప్పి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్య, ఈశాన్య జిల్లాల్లో పాకిస్తానీ జాతీయుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేశామని.. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించినట్లు ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. పరిస్థితిని సీనియర్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లుగా తెలిపారు. ఢిల్లీలో నివసిస్తున్న ఈ పాకిస్తానీ పౌరుల గురించి సమాచారాన్ని సేకరించి, వీలైనంత త్వరగా భారతదేశం విడిచి వెళ్లేలా ఢిల్లీ పోలీస్, ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక శాఖ అధికారులు అప్పగించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం సార్క్ వీసాలను రద్దు చేసింది. ఇప్పటికే వీసాలపై భారత్‌కు వచ్చిన వారంతా మే ఒకటో తేదీ వరకు దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే.ం

## పాక్ కవ్వింపు చర్యలు.. మరోసారి సరిహద్దులో కాల్పులు



శ్రీనగర్: సరిహద్దులో మరోసారి పాకిస్థాన్ కాల్పులకు పాల్పడింది. శనివారం మధ్య రాత్రి నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ సైనికులు కాల్పులు జరిపినట్లు భారత ఆర్మీ తెలిపింది. సరిహద్దు వెంబడి టుట్మారి గాలి, రాంపూర్ సెక్టార్లకు ఎదురుగా ఉన్న ప్రాంతాలలో పాకిస్థాన్ దళాలు కాల్పులకు పాల్పడటంతో వెంటనే అప్రమత్తమైన భారత సైన్యం కాల్పులకు తిప్పికొట్టింది. ఈ కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కాగా, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్ మాకు సంబంధం లేదంటూనే భారీగా సైన్యాన్ని సరిహద్దుకు తరలిస్తోంది. కాగా, ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఉగ్రవాదుల ఏరివేసేందుకు భారత ఆర్మీ ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తోంది. ఈక్రమంలో పాక్ కవ్వింపు చర్యలకు దిగుతోంది.

# కిన్నెరసాని.. చూసొద్దాం రండి..

### అలరారే ప్రకృతి అందాలకు నిలయం

### మినీ ఊటీని తలపించేలా సుందర దృశ్యాలు

### జింకల వీక్షణం.. బోటు షికారు ప్రత్యేకం

### వేసవి సెలవుల్లో ఓ రోజు గడిపేందుకు

### అద్భుతమైన ప్రదేశం



పాల్వంచ రూరల్: వేసవి సెలవులు వచ్చాయి. చిన్నారులు, పెద్దలు, మహిళలు వెళ్లేందుకు కిన్నెరసాని ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనాన్ని పంచే అడవులు, స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే చెట్లు.. చెంగుచెంగున ఎగిరే వన్యప్రాణులు, గలగలా పారే సెలయేర్లు.. పక్షుల కిలకిలారావాలకు కిన్నెరసాని డీర్‌పార్కు చిరునామాగా నిలుస్తోంది. అడుగడుగునా ఆహ్లాదాన్ని పంచే జీవ వైవిధ్యం గల అటవీ అందాలతో మినీ ఊటీగా మారుతోంది కిన్నెరసాని పర్యాటక ప్రాంతం. కొండకోనలు, పచ్చని చెట్లు, జలాశయం, వన్యప్రాణులతో చూడచక్కని ప్రకృతి అందాలకు నిలయమైన కిన్నెరసానిలో పర్యాటకులను ఆకట్టుకునేలా పచ్చని పొదరిళ్లు, ఎత్తయిన కొండలు, గుట్టలు, జలాశయం, చూడచక్కని ద్వీపాలు కనిపిస్తాయి. పర్యాటకుల ఊహకు ఏమాత్రం తగ్గని రీతిలో ఇక్కడి ప్రకృతి సోయగాలు ప్రతీ ఒక్కరిని అలరిస్తాయి. ఈ సుందర దృశ్యాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వస్తుంటారు.

### పర్యాటకులను ఆకర్షించేలా కాటేజీలు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో నీతి ఆయోగ్ పథకం కింద రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఆయా నిధులతో కిన్నెరసానిలో తొమ్మిది కాటేజీలు, అద్దాలమేడ నిర్మాణం చేపడుతున్నారు. కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల కోసం బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు డీర్‌పార్క్‌లోని చుక్కల జింకలు, జలాశయం అందాలను చూసి.. మరోసారి రావడానికి ఉత్సాహం చూపుతుంటారు.

### అద్దాలమేడకు ఎంతో ప్రాముఖ్యం

కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఒకప్పుడు అద్దాలమేడకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. 1978లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అద్దాలమేడతో పాటు పలు కాటేజీలు నిర్మించారు. అయితే ఆ తర్వాత అద్దాలమేడను మావోయిస్టులు ధ్వంసం చేయడంతో కళావిహీనంగా తయారైంది. కాగా, కిన్నెరసానిని పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా అద్దాలమేడ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ,10.77 కోట్లు ఖర్చు చేశారు. శిథిలావస్థకు చేరిన అద్దాలమేడతో పాటు కాటేజీలను కూల్చి వాటి స్థానంలో కొత్తవి నిర్మించారు. రిజర్వాయర్ చుట్టూ ఎత్తయిన గుట్టపై రెండంతస్తుల్లో 9 కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు నిర్మించారు.

### కిన్నెరసానికి ఎలా చేరుకోవాలంటే..

ఖమ్మం నుంచి భద్రాద్రి జిల్లా పాల్వంచకు 90 కిలోమీటర్లు ఉంటుంది. ఈ పట్టణానికి చేరుకున్నాక అంబేద్కర్ సెంటర్ నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే కిన్నెరసాని ప్రాజెక్టు వస్తుంది. అక్కడ ప్రకృతి అందాలతో నిండిన జలాశయం, జింకల పార్కు ఉంటాయి. కిన్నెరసానికి సమీపంలోని మందెరకలపాడు సమీప అటవీ ప్రాంతంలో జలపాతం ఉంది. ఇక్కడ నుంచి తిరిగి భద్రాచలం వెళ్లే మార్గంలో పెద్దమ్మతల్లి ఆలయం ఉంది. కాగా, కిన్నెరసాని చేరడానికి బస్ సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయించాల్సిందే. వేసవి సెలవుల్లోనైనా బస్సు సౌకర్యం కల్పిస్తే కిన్నెరసానికి పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఇక వరంగల్ జిల్లా లక్నవరంలో ఏర్పాటు చేసినట్లుగా కిన్నెరసానిలో కూడా నీళ్ల మధ్య వంతెన నిర్మించి, ప్రత్యేక హోటళ్లు, వసతి గృహాలను నిర్మిస్తే పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవచ్చు.

# కాలుష్యకాసారంగా కృష్ణా నది

### కృష్ణా జలాల్లో ప్రమాదకర బ్యాక్టీరియా

### మోతాదుకు మించి ఘనవ్యర్థాలు

### విచ్చలవిడిగా నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు

### అడవుల నరికివేత, ఇష్టారాజ్యంగా గనుల తవ్వకమూ కారణం

### ఏపీపీసీబీ పరీక్షల్లో వెల్లడి

### శుద్ధి చేయకుండా తాగడం శ్రేయస్కరం కాదంటున్న నిపుణులు



మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో మహాబలేశ్వర్‌కు సమీపంలో జన్మించి, ఒంపు సొంపులతో బిరబిరా సాగుతూ కృష్ణా జిల్లా హంసలదీవి వరకు పరుగులిడే కృష్ణా నది తెలుగు రాష్ట్రాలకు జీవనాధారం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సాగు, తాగునీటి కోసం అధికంగా ఆధారపడేది కృష్ణా జలాలపైనే. నిత్యం నీరు పారే ఈ జీవ నది మానవ తప్పిదాల కారణంగా ఇప్పుడు కాలుష్యకాసారంగా మారింది. ఒకప్పుడు నేరుగా తాగేంత స్వచ్ఛంగా ఉన్న కృష్ణా నది నీరు ఇప్పుడు శుద్ధి చేయనిదే తాగకూడని దశకు చేరాయి. ఈ నది జలాల్లో క్షార స్వభావం, బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ), ప్రమాదకర బ్యాక్టీరియా (ఫీకల్ కోలిఫారమ్), ఘన వ్యర్థాలు అధికంగా ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) గత నెల (మార్చి)లో నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైంది. కృష్ణా నీటిని శుద్ధి చేయకుండా తాగడం శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. శుద్ధి చేయకుండా తాగితే డయేరియా, చర్మ వ్యాధుల, ఇతర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ నది పరీవాహక ప్రాంతంలో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో మురుగునీటిని యథేచ్ఛగా వదిలేయడం, పారిశ్రామిక వ్యర్థాలను విడిచిపెట్టడం, అనేక ప్రాంతాల్లో నదినే దంపింగ్ యార్డ్‌గా మార్చేయడం వల్ల జలాలు కలుషితమవుతున్నాయి. అడవులను నరికివేయడం, గనులను ఇష్టారాజ్యంగా తవ్వడం వల్ల కూడా నది కలుషితమవుతోంది. పర్యవసానంగా కృష్ణా జలాలు నేరుగా తాగడానికి పనికి రాకుండా పోతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణా జలాల నాణ్యతపై ఏపీపీసీబీ ప్రతి నెలా పరీక్షలు చేస్తోంది. ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్షల్లో కృష్ణా జలాల్లో కాలుష్య తీవ్రత అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. పీహెచ్ 7 శాతం లోపు ఉంటే ఆమ్ల స్వభావం.. 7 శాతం కంటే ఎక్కువ ఉంటే క్షార స్వభావం ఉన్నట్లు లెక్క. పీహెచ్ 7 ఉంటే స్వచ్ఛమైన నీరుగా లెక్క. కానీ.. కృష్ణా జలాల్లో పీహెచ్ 7 శాతం కంటే ఎక్కువగా ఉంది. అంటే జలాల్లో క్షార స్వభావం ఎక్కువ ఉన్నట్లు స్పష్టమవుతోంది. నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో), బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ) కూడా మోతాదుకు మించి ఉన్నట్లు వెల్లడైంది. తాగే నీటిలో అత్యంత ప్రమాదకరమైన ఫీకల్ కోలీఫామ్ బ్యాక్టీరియా వంద మిల్లీ లీటర్లకు ఒక్కటి కూడా ఉండకూడదు. కానీ.. కృష్ణా జలాల్లో వంద మిల్లీ లీటర్లకు 11 నుంచి 58 వరకూ ఈ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. నీటిలో ఘనవ్యర్థాలు వంద మీల్లీ లీటర్లకు 500 మిల్లీ గ్రాముల వరకూ ఉండవచ్చు. కానీ.. కృష్ణా నీటిలో ఘన వ్యర్థాలు అంతకంటే ఎక్కువ ఉన్నట్లు వెల్లడైంది. మురుగు నీటిని, పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేయడం, వ్యర్థాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా కృష్ణా నదిని స్వచ్ఛంగా మార్చవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

కృష్ణా జలాల నాణ్యతపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మార్చిలో నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైన ఫలితాలు..

| ప్రదేశం | పీహెచ్ | డీవో (మి.గ్రా/లీటర్) | బీవోడీ (మి.గ్రా/లీటర్) | టీసీ (సంఖ్య/లీటర్) | ఎఫ్‌సీ (సంఖ్య/మిలీ) | టీడీఎస్ (మి.గ్రా/లీటర్) |
|---|---|---|---|---|---|---|
| సంగమేశ్వరం | 7.72 | 8.2 | 1.4 | 214 | 30 | 274 |
| శ్రీశైలం | 8.26 | 7.9 | 1.8 | 220 | 102 | 330 |
| వాడపల్లి | 7.39 | 7.3 | 2.6 | 150 | 21 | 580 |
| వేదాద్రి | 7.34 | 6.9 | 2.8 | 210 | 21 | 582 |
| అమరావతి | 7.56 | 6.8 | 2.7 | 210 | 20 | 510 |
| ప్రకాశం బ్యారేజ్ | 7.54 | 7.2 | 2.6 | 150 | 14 | 520 |
| హంసలదీవి | 7.77 | 6.5 | 2.6 | 75 | 11 | 11420 |

(పరామితి (పారామీటర్))

### బీఐఎస్ ప్రమాణాల మేరకు తాగు నీటికి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన ప్రమాణాలు

1. పీహెచ్ 6.5 నుంచి 8.5 శాతం లోపు ఉండొచ్చు 2. డీవో (డిజాల్వ్‌డ్ ఆక్సిజన్) లీటర్ నీటికి 6 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ ఉండాలి 3. బీవోడీ (బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్) లీటర్ నీటికి 2 మిల్లీగ్రాముల లోపు ఉండొచ్చు 4. టోటల్ కోలీఫామ్ (టీసీ-బ్యాక్టీరియా) 100 మిల్లీలీటర్ల నీటికి 50 లోపు ఉండొచ్చు 5. ఫీకల్ కోలీఫామ్ (ఎఫ్‌సీ-ప్రమాదకర బ్యాక్టీరియా) 100 మిల్లీలీటర్లకు నీటికి ఒక్కటి కూడా ఉండకూదు 6. టీడీఎస్ (టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్) లీటర్ నీటికి 500 మిల్లీగ్రాముల లోపు ఉండొచ్చు

# సింధూ ఒప్పందంపై నిపుణుల స్పష్టీకరణ

### సస్పెన్షన్ సాధ్యమే

### పూర్తిగా తిరస్కరించవచ్చు కూడా

### అంతర్జాతీయ చట్టాల్లో వీలుంది



పూర్తిస్థాయి యుద్ధాలు. కార్గిల్ వంటి దురాక్రమణలు. మరెన్నో లెక్కలేనన్ని దుశ్చర్యలు. గత 75 ఏళ్లలో భారత్‌పై పాకిస్తాన్ మతిలేని ఉన్మాద చర్యలు అన్నీ ఇన్నీ కావు. అయినా సామాన్య పాకిస్తానీలను దృష్టిలో పెట్టుకుని సింధూ జల ఒప్పందాన్ని భారత్ ఎప్పుడూ గౌరవిస్తూనే వచ్చింది. ఆర్థికంగానే గాక అన్నివిధాలా పతనావస్థకు చేరినా దాయాదికి ఇక బుద్ధి రాబోదని పహల్గాం దాడితో తేలిపోయింది. దాంతో ఓపిక నశించి పాక్‌కు శాశ్వతంగా బుద్ధి చెప్పే చర్యల్లో భాగంగా సింధూ ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసింది. ఏకపక్షంగా అలా చేసే అధికారం భారత్‌కు లేదంటూ పాక్ గగ్గోలు పెడుతోంది. ఇది తమపై యుద్ధ ప్రకటనేనంటూ ఆక్రోశిస్తోంది. అయితే అంతర్జాతీయ చట్టాల మేరకు భారత్ చర్య సబబేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం మానుకోని పక్షంలో సింధూ ఒప్పందానికి నూకలు చెల్లుతాయంటూ పాక్‌ను భారత్ ఎన్నోసార్లు హెచ్చరించింది. సస్పెన్షన్‌కు సంబంధించి ఒప్పందంలో స్పష్టమైన నిబంధనలేవీ లేవు. పైగా అందులోని ఆర్టికల్ 12 ప్రకారం ఒప్పందానికి సవరణలు, ఇరుదేశాల ఆమోదంతో పూర్తిగా రద్దు మాత్రమే సాధ్యం. అలాంటప్పుడు సస్పెన్షన్ నిర్ణయాన్ని ఏ ప్రాతిపదికన తీసుకున్నారన్నది ప్రాధాన్యం సంతరించుకుంది. 1969 వియన్నా కన్వెన్షన్, ఇతర అంతర్జాతీయ న్యాయ ఒప్పందాల ప్రకారం అలా చేసేందుకు వీలుందని సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ స్పష్టం చేశారు. 'పరిస్థితుల్లో మౌలిక మార్పులు'చోటుచేసుకున్న సందర్భాల్లో వియన్నా కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 62 ప్రకారం ఒప్పందాన్ని పూర్తిగా తిరస్కరించడం కూడా సాధ్యమేనని మాజీ సింధూ జల కమిషనర్ పి.కె.సక్సేనా వివరించారు. ఈ విషయంలో ఇంకా మరెన్నో చర్యలు తీసుకునే అవకాశం కూడా భారత్‌కు ఉందని కూడా ఆయన స్పష్టం చేశారు.

### ఆర్టికల్ 62 ఏమంటోంది...?

ఒప్పందం కుదుర్చుకున్న నాటితో పోలిస్తే అనంతర కాలంలో పరిస్థితుల్లో తలెత్తే మౌలిక మార్పులకు సంబంధించిన నియమ నిబంధనలను వియన్నా కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 62లో పేర్కొంటుంది. అవి ఒప్పంద సమయంలో ఊహించనివై, ఆ మార్పుల ప్రభావం వల్ల ఒప్పంద బాధ్యతలను నెరవేర్చలేని పరిస్థితులు తలెత్తితే ఒప్పందాన్ని సస్పెండ్ చేయవచ్చని అది చెబుతోంది. కనుక ఈ విషయంలో పాక్ చేసేదేమీ ఉండబోదని కౌల్ అన్నారు. "చివరికి అంతర్జాతీయ న్యాయస్థానం తలుపు తట్టినా లాభముండదు. నిరంతర ఉగ్ర దాడులు, ఫలితంగా భౌతిక, ఆర్థిక భద్రతకు, దేశ సార్వభౌమత్వానికి తలెత్తుతున్న ముప్పు ఒప్పంద పరిస్థితుల్లో మౌలిక మార్పులకు దారి తీసిందని భారత్ వాదించవచ్చు. సింధూ ఒప్పందం కుదిరిందే ఇరు దేశాల నడుమ స్నేహం, సద్భావనల స్ఫూర్తికి కార్యరూపమిచ్చేందుకు! పాక్ చర్యల నేపథ్యంలో ఆ పరిస్థితులుపూర్తిగా మారిపోయాయి" అని వివరించారు. పర్యావరణ సవాళ్లు, ఉగ్ర దాడుల నేపథ్యంలో ఒప్పందాన్ని సమీక్షించి మార్చుకోవాల్సిన అవసరముందని కొన్నేళ్లుగా భారత్ చెబుతోందని గుర్తు చేశారు.

### ఇవన్నీ చేయొచ్చు...

ఒప్పందం సస్పెన్షన్ వల్ల సింధూ బేసిన్ నదుల నీటి ప్రవాహ నెలవారీ డేటాను భారత్ ఇకపై పాక్‌తో పంచుకోవాల్సిన అవసరం లేదు. నీటి ప్రవాహాల ఉమ్మడి తనిఖీకి పాక్ అధికారులకు భారత్‌లోకి ప్రవేశం నిరాకరించవచ్చు. నీటి ప్రవాహాలను నియంత్రించడం వంటి కఠిన చర్యలకు కూడా తీసుకోవచ్చు. సింధూతో పాటు జీలం, చినాబ్, రావి, బియాస్, సట్లె జ్ నదుల ప్రవాహాలను కాల్వల వంటివాటిలోకి మళ్లించవచ్చు. వాటిపై డ్యాముల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా మరింత నీటిని నిల్వ చేయవచ్చు. ఇలాంటి చర్యలతో పాక్‌లోకి వాటి ప్రవాహాన్ని నిరోధించవచ్చు. సింధూ బేసిన్‌కు సంబంధించి భారత్, పాక్ నడుమ పలు అంతర్జాతీయ వేదికలపై న్యాయపోరాటం సాగుతోంది. జీలం ఉపనది కిషన్‌గంగపై నిర్మిస్తున్న జల విద్యుత్కేంద్రం వంటివి వీటిలో ఉన్నాయి. ఆ వివాదాలన్నింటి నుంచీ ఇప్పుడు భారత్ ఏకపక్షంగా వైదొలగవచ్చు కూడా. వేసవి దృష్ట్యా సింధూ బేసిన్‌లోని నదీ ప్రవాహాలను భారత్ ఇప్పుడు ఏమాత్రం నియంత్రించినా తాగు, సాగునీరుతో పాటు జల విద్యుత్ తదితరాల కోసం పాక్ అల్లాడటం ఖాయమే.

## వాంకోవర్‌లో జనంపైకి దూసుకెళ్లిన కారు.. పలువురు మృతి




ఒట్టావా : కెనడాలోని వాంకోవర్‌లో వేడుక జరుపుకుంటున్న జనంపైకి కారు దూసుకెళ్లడంతో పలువురు మరణించారు. ఎంతమంది మరణించారన్న సమాచారం తెలియాల్సి వుంది. ఈ ఘటన స్థానిక కాలమానం ప్రకారం.. శనివారం రాత్రి 8.00 గంటల సమయంలో జరిగిందని పోలీసులు తెలిపారు. లాపు-లాపు వేడుక సందర్భంగా పలువురు ఫిలిప్పీన్స్ కమ్యూనిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో వాంకోవర్‌లోని ఇ-41 అవెన్యూ మరియు ఫ్రాసర్ వీధికి చేరుకున్న సమయంలో ఈ ఘటన జరిగింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా లేదా దాడి జరిగిందా అన్న అంశాన్ని అధికారులు నిర్ధారించాల్సి వుంది. నల్లటి ఎస్‌యువి కారు వేడుక కోసం అక్కడికి చేరిన జనసమూహంపై దూసుకువచ్చిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. డ్రైవర్ ఆసియా యువకుడని, మానసిక వికలాంగుడిగా కనిపిస్తున్నట్లు వెల్లడించారు. 16వ శతాబ్దానికి చెందిన వలసవాద వ్యతిరేకి, ఫిలిప్పీన్స్ నేత దాతు లాపు-లాపు జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో వేడుకను నిర్వహిస్తారు.వాంకోవర్ ఘటనపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మరణించిన, గాయపడిన వారికి, ఫిలిప్పీన్స్ కమ్యూనిటీకి, వాంకోవర్‌లోని ప్రతి ఒక్కరికీ నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.

## విద్వేషాల బజారులో ప్రేమ దుకాణం తెరిచాం

### భారత్ సమ్మిట్ ప్లీనరీలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ



హైదరాబాద్ : దేశ రాజకీయాల్లో పాతతరం అంతరించిపోయిందనీ, మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. 'విద్వేషాల బజారులో ప్రేమ దుకాణం తెరిచాం' అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాల్లో చాలా మార్పులొచ్చాయన్నారు. గడిచిన పదేళ్లలో దేశంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. ప్రభుత్వ పాలసీలపై లోతుగా చర్చించాల్సి ఉందని చెప్పారు. చట్టసభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కూడా రావడం లేదన్నారు. విపక్షాలు తమ గొంతు వినిపించేందుకు కొత్త వేదికలు వెతుక్కోవాల్సి వస్తోందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవాటెల్‌లో రెండోరోజు భారత్ సమ్మిట్ ప్లీనరీ ముగింపులో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య రాజకీయాలు మారిపోయాయి. పదేళ్ల నాటి పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. మోడ్రన్ సోషల్ మీడియాతో అంతా మారిపోయిందనీ, ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమేనన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టానని గుర్తు చేశారు. పాదయాత్ర మొదట్లో తనతో కొద్ది మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రోజులు గడుస్తున్న కొద్దీ తనతో వేలాది మంది నడిచారని గుర్తు చేశారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రయత్నించి విజయం సాధించినట్టు తెలిపారు. దేశ ప్రజలకు ప్రేమను పంచేందుకు పాదయాత్రను మొదలు పెట్టామన్నారు. ఈ యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నట్టు చెప్పారు.

## పహల్‌గామ్ ఉగ్రదాడి కేసులో కీలక మలుపు..




న్యూఢిల్లీ: ప్రకృతి అందాల నడుమ అత్యంత సౌందర్యంగా ఉండే పహల్‌గామ్‌లో ఈ నెల 22వ తేదీన ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. పర్యాటకులపై విచక్షణరహితంగా కాల్పులు జరిపి 28 మంది ప్రాణాలు తీశారు. ఈ ఘటన యావత్ భారతదేశాన్ని కుదిపేసింది. ఉగ్రవాదలకు వ్యతిరేకంగా అందరిని ఒక తాటిపైకి తెచ్చింది. ఉగ్రవాదులను, వారిని భారత్‌పైకి ఉసిగొల్పుతున్న పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును భారత భద్రత బలగాలు, జమ్ము కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నాయి. అయితే ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ)కి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అప్పగించింది. ఘటన జరిగిన సమయంలో ఉగ్రవాదులను చూసిన పర్యటకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీస్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. పహల్‌గామ్‌లోకి ప్రవేశించే, బయటకు వెళ్లే మార్గాలను ఫోరెన్సిక్ బృందం సహాయంతో తనిఖీలు చేస్తున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. ఘటనస్థలంలో తీసుకున్న ఫోటోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని.. ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుంది: ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడిపై మరోసారి ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. మన్ కీ బాత్ 121వ ఎపిసోడ్‌లో ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. దేశాన్ని, ప్రపంచాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కాశ్మీర్ లో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక.. దాన్ని నాశనం చేయడానికి శత్రువులు ప్రయత్నించారని చెప్పారు. ఉగ్రదాడిపై అంతా అగ్రహంతో రగిలిపోతున్నారని అన్నారు. ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుందని.. ఉగ్రవాదులకు ధీటైన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ఉగ్రవాదంపై పోరాటంలో అన్ని పౌరుల ఐక్యత అత్యంత ముఖ్యమైందని..కష్టకాలంలో దేశం మొత్తం ఏకతాటిపై నిలిచిందన్నారు. ఈ పోరాటంలో భారత లోని 1.4 బిలియన్ల ప్రజలకు ప్రపంచం అండగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాశ్మీర్‌లో శాంతి తిరిగి వస్తోందని, పర్యాటకుల సంఖ్య పెరుగుతోందని, అభివృద్ధి పనుల్లో పురోగతి ఉందని మోడీ అన్నారు. కాగా, ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు.

# కొల్లేరు పక్షులను, ప్రజలనూ కాపాడుకోవాలి



ఆసియాలో పెద్దదైన సహజసిద్ధ మంచినీటి సరస్సు కొల్లేరు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నడుమ 10 మండలాల్లో లోతట్టు గ్రామాలు (బెడ్) 46, చేర్చి ఉన్న గ్రామాలు (బెల్ట్) 74తో సహా 120 గ్రామాలలో 77 వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. 5 లక్షలకు పైగా జనాభా నివశిస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో అత్యధిక భాగం ఏలూరు జిల్లాకు వచ్చింది. వందల రకాల పక్షులు లక్షలాదిగా ఆవాసముంటున్నాయి. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో వున్న సైబీరియా పక్షులు సైతం వలస వస్తుంటాయి. అలాంటి కొల్లేరు నేడు కాలుష్యమయం అయింది. దీనికితోడు ఆక్వా మాఫియా కొల్లేరునంతా ఆక్రమించి చేపల చెరువులు తవ్వేసింది. దీంతో కొల్లేరు గమనానికి ఆటంకం ఏర్పడి బుడమేరు సైతం పొంగి విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. చిత్తడి నేలల పరిరక్షణ కరవైంది. పక్షులకు ఆవాసంగా ఉన్న కొల్లేరు అభయారణ్యం కనుమరుగౌతున్నది. లాభాలే పరమావధిగా ఉన్న పరిశ్రమల యజమానులు మురికి జలాల శుద్ధి ప్లాంటేషన్లు ఏర్పాటు చేయనందున, చేసినా నిర్వహించనందున వ్యర్ధ జలాలు యథావిధిగా కొల్లేరులోకి వదులుతున్నారు. కొల్లేరు పరిసరాల్లోని ఆక్వా చెరువులో వాడే కోళ్ళ వ్యర్థాలు, జలాలు ఇందులోనే కలుస్తున్నాయి. ఈ కాలుష్యాన్ని అరికట్టే చర్యలు ఏ ప్రభుత్వాలూ తీసుకున్న దాఖలాలు లేవు. కొల్లేరు 3వ కాంటూరు పైబడి 40 వేల ఎకరాల భూములున్నాయి. వీటిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 146 సొసైటీల కింద 17 వేల ఎకరాలున్నాయి. మిగిలినవి పట్టా భూములు. కొల్లేరు ప్రజలు అత్యధికులు ఈ సొసైటీ భూములు లేదా జిరాయితీ భూములు ఎకరం నుండి అరెకరం కల్గినవారే అత్యధికులు. చేపల వేట, వ్యవసాయ కూలీ పనులతోపాటు ఈ భూముల్లో చేపల చెరువులే కొల్లేరు ప్రజలకు ఆధారం. తమ రాజకీయ ప్రయోజనాల కోసం, పర్యావరణ పరిరక్షణ పేరుతో 2005లో నాటి చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 120 జీవోనే ఈ పరిస్థితికి మూలమైంది. ఈ జీవో ఆధారంగా రాష్ట్రంలో కొందరు పర్యావరణ పరిరక్షణ కోసమంటూ సుప్రీం కోర్టుకెక్కారు. దీంతో సుప్రీంకోర్టు పర్యావరణ పరిరక్షణ, చిత్తడి నేలల పరిరక్షణకు యు.ఎన్.ఓ. తీర్మానం, పక్షుల పరిరక్షణ ఆధారంగా కొల్లేరులో 5వ కాంటూరులో ఆక్వా చెరువులు తొలగించాలి, అభయారణ్య నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. పదో కాంటూరు వరకు సున్నిత ప్రాంతంగా గుర్తించి పరిరక్షించాలని చెప్పింది. ఇది స్థానిక ప్రజల మనుగడకు ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల సందర్భంగా కొల్లేరును 3వ కాంటూరుకు కుదిస్తామని భీమవరం సభలో ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. గత అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేశారు. బాంబులతో చెరువుల తొలగింపు సందర్భంగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇవేవీ అమలుకు నోచుకోలేదు. 3వ కాంటూరుకు కుదించడమెలా ఉన్నా 10వ కాంటూరు వరకూ సున్నిత పర్యావరణ పరిరక్షణ ప్రాంతంగా విస్తరిస్తున్నారు. ఇందుకు ఎన్నికల ముందు, తర్వాత గ్రామ సభలు తూతూ మంత్రంగా జరిపారు. ఇదే జరిగితే ఏలూరు, ఆకివీడు పట్టణాలు సహా 89 గ్రామాలు మొత్తం అభయారణ్య నిబంధనల కిందకు వస్తాయి. అపుడు పూర్తిగా ప్రజల రోజువారీ జీవనమంతా అటవీశాఖ అధీనంలోకి వెళ్తోంది. అన్ని సందర్భాలలోనూ పాలక పార్టీలన్నీ కొల్లేరు ప్రజల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజల పక్షం. అధికారంలో ఉంటే నిరంకుశత్వం లేదా మాయమాటలు, భ్రమలతో అప్పటికప్పుడు తాత్కాలికంగా గట్టెక్కించే చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు. అన్ని సందర్భాల్లోనూ సిపిఎం శాస్త్రీయమైన, ప్రజల పరిరక్షణ వైఖరితో కొల్లేరు ప్రజలకు దన్నుగా నిలుస్తున్నది. భారీ వర్షాల కాలంలో కొల్లేరే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా వరద ముంపు రాకుండా ఉండలన్నా, ప్రజలు, పక్షులు రక్షించబడాలన్నా ఇప్పటికే జస్టిస్ మిత్రా, శ్రీరామకృష్ణయ్య కమిటీలు లోతైన పరిశీలనతో తగు పరిష్కారాలు చెప్పాయి. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వాటిని అమలు చేయాలి. ఫ్యాక్టరీలు, మున్సిపాలిటీల వ్యర్ధ జలాలు రాకుండా అరికట్టాలి. ఏరులు, కాల్వల పూడికలు తీసి, వెడల్పు చేయాలి. కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి. ఆ ప్రాంతంలో పక్షుల పరిరక్షణకు, పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. 3వ కాంటూరుపైన ఉన్న భూముల్ని పేదలకు పంచాలి. జిరాయితీ, సొసైటీ భూముల్లో సాగుకు అనుమతించాలి. ఈ ప్రాంత ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరాకు ప్రత్యేక వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయాలి. అన్ని గ్రామాల్లో రోడ్లు నిర్మించాలి. ఉపాధి హామీ పనులు ప్రత్యేకంగా 200 రోజులకు పెంచి అమలు చేసి కొల్లేరు ప్రజల్ని ఆదుకోవాలి. వీటన్నిటితోపాటు ప్రస్తుతం సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్‌లో సాగుతున్న వ్యాజ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతివాదులుగా చేరి ప్రజల పక్షాన మాట్లాడాలి. 3వ కాంటూరుకు కుదించేలా శాశ్వతంగా ఓ చట్టాన్ని తీసుకురావాలి. ఇందుకు కొల్లేరు ప్రజలు నాటి పోరాట స్ఫూర్తితో ఐక్యం కావాలి.

# సుప్రీంకోర్టు జోలికి రాకండి!



భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, బిజెపి నాయకులు సుప్రీంకోర్టు మీద విషపూరిత దాడిని ప్రారంభించారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలుపకుండా అడ్డుపడుతూ తమిళనాడు గవర్నర్ అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన పోకడల గురించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ దాడులు మొదలయ్యాయి. ఆ తర్వాత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) నాయకత్వంలోని ధర్మాసనం వక్ఫ్ చట్టానికి సంబంధించి తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఉపరాష్ట్రపతి ధన్కర్ న్యాయమూర్తులు 'ఎలాంటి జవాబుదారీతనం లేని', 'సూపర్ పార్లమెంటు'గా తయారయ్యారని ఆరోపించారు. 'వారికి ఈ దేశపు చట్టాలు వర్తించవని' వాకృచ్చారు. అంతేగాక సంపూర్ణ న్యాయం జరిపించేందుకుగాను కోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న 142 అధికరణం 'ప్రజాస్వామిక శక్తులపై అణు క్షిపణి' లాగా తయారయ్యిందని కూడా సెలవిచ్చారు. బిజెపి ఎంపి నిశికాంత్ దుబే మరింత పైత్య ప్రకోపంతో సిజెఐ సంజీవ్ ఖన్నా లక్ష్యంగా దాడి చేశారు. ఆయనే "దేశంలో అన్ని అంతర్యుద్ధాలకు" కారకుడు అవుతున్నారని దాడి చేశారు. సుప్రీంకోర్టే చట్టాలు చేసేటట్లయితే పార్లమెంటును మూసుకోవాలని కూడా ఆ ఎంపి మాట్లాడారు. న్యాయ వ్యవస్థ, పార్లమెంటు తనకు లోబడి వుండాలని ధన్కర్, ఆయన బృందం కోరుకుంటోంది. ఇది రాజ్యాంగ నిర్దేశాలకు వ్యతిరేకమైన విషయం. చట్టసభలు రూపొందించిన శాసనాలను సమీక్షించేందుకు, అవి రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్నాయా లేదా అని సమీక్షించేందుకు సుప్రీంకోర్టుకు అధికారం ఉంది. రాజ్యాంగ సవరణలు కూడా దాని 'మౌలిక స్వభావం' పరిధిలో వున్నాయా అని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చు.

### అసలు కారణం

బిజెపి, పక్షపాతంతో దానికి వంత పాడే ఉపరాష్ట్రపతి వంటి మద్దతుదారులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారంటే ఇటీవల సుప్రీంకోర్టు ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన చారిత్రక తీర్పు కారణం. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి శాసనసభ ఆమోదించిన తీర్మానాలకు అంగీకార ముద్ర వేయకుండా తొక్కి పట్టడాన్ని, తర్వాత వాటిని రాష్ట్రపతికి పంపించడాన్ని విచారించిన కోర్టు ఈ తీర్పునిచ్చింది. గవర్నర్ అనుసరిస్తున్న ఈ తీరు చట్టరీత్యా తప్పని, చట్ట విరుద్ధమని ప్రకటించింది. ఆయన ఇలా తొక్కి పట్టిన 10 బిల్లులను ఆమోదించినట్టే పరిగణించాలని 142 అధికరణం మేరకు ప్రకటించింది. ఈ విషయం న్యాయస్థానం సరైన రీతిలో జోక్యం చేసుకుని గవర్నర్ రాజ్యాంగ విరుద్ధ చర్యను చక్కదిద్దింది. బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలున్న చోట్ల జోక్యం చేసుకుని ఆటంకాలు కల్పించేందుకు గవర్నర్లను పనిముట్లుగా వాడుతున్న బిజెపి కి ఇది కార్యనిర్వాహక వర్గం, పార్లమెంటు అధికారాల ధిక్కారంగా కనిపించింది. కేంద్రంలోని బిజెపి నేతృత్వ ప్రభుత్వం అనుసరించే ఈ నిరంకుశ ధోరణులనే ఇప్పుడు సుప్రీంకోర్టులో జయప్రదంగా సవాల్ చేయబడ్డాయి.

### వక్ఫ్ చట్టంలో తప్పులు

వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అధ్యక్షతన గల త్రిసభ్య ధర్మాసనం మొదట్లోనే ఆ చట్టంలోని కొన్ని అంశాలు, ఒక మత బృందానికి లేదా అల్ప సంఖ్యాకులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘించేవిగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. 'వినియోగంలో వక్ఫ్' అన్న భావనను పూర్తిగా లేకుండా చేసే తప్పు నిబంధనలను కోర్టు గమనంలోకి తీసుకుంది. ఈ చట్టం అమలుకు వచ్చేట్లయితే దీని ద్వారా ఒక్క పోటుతో వేలకు వేల వక్ఫ్ ఆస్తులు చెల్లకుండా పోతాయని పేర్కొంది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను ఎలా నియమిస్తారని కోర్టు ప్రశ్నించింది. దేవాలయాల ట్రస్టులు బోర్డులలో ముస్లింలను నియమించవచ్చునా అని అడిగింది. వక్ఫ్ ఆస్తులపై వివాదాల పరిష్కారంలో కలెక్టర్ల పాత్రపై కూడా ప్రశ్నలు వేసింది. ఈ విషయంలో మధ్యంతర ఉత్తర్వు రాకుండా అడ్డుకునేందుకోసమే సొలిసిటర్ జనరల్ కోర్టు తుది నిర్ణయం చేసే వరకు కేంద్రం వినియోగంలో వక్ఫ్ అన్న అంశాన్ని మార్చబోదని అధికారికంగా చెప్పారు. కోర్టు తదుపరి విచారణ మే 5వ తేదీన జరగనుంది.


### న్యాయ వ్యవస్థకు బెదిరింపులు

వక్ఫ్ చట్టంపై కోర్టు తీసుకున్న ఈ వైఖరి కరుడుగట్టిన నిశికాంత్ దుబే వంటి బిజెపి నేతలకు దురాగ్రహానికి కారణమైంది. ఉన్నత న్యాయ వ్యవస్థను బెదిరించేవిగా, ఒత్తిడి చేసేవిగా వారి వ్యాఖ్యలను చూడవలసి ఉంది. వారి మాటలను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించింది. అవి ప్రధాన న్యాయమూర్తిని అవమానించే విధంగా ఉన్నాయని పేర్కొంది. దుబేపై కోర్టు ధిక్కార చర్యల పిటిషన్‌కు అనుమతినివ్వాలని అటార్నీ జనరల్‌ను అభ్యర్థించింది. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను తన అదుపులోకి తెచ్చుకోవాలనే నిరంకుశ ప్రయాణంలో సుప్రీంకోర్టును కూడా వదిలిపెట్టడంలేదు. ఏమైనా ఎన్ని ప్రయత్నాలు చేసినా అది ఉన్నత న్యాయవ్యవస్థను పట్టుకోలేకపోయింది. అది పూర్తిగా లోబడేలా చేసుకోలేక పోయింది.

### స్వతంత్రతను కాపాడుకోవాలి

ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు కేంద్ర ఏజెన్సీలు లక్ష్యంగా చేసుకున్న వారి హక్కులను, బెయిల్ మంజూరును కాపాడే విధంగా తీర్పులు వెలువరించింది. దీంతోపాటు రాష్ట్రాల శాసనసభల హక్కులను కాపాడే విధంగా, గవర్నర్ల అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునే విధంగా వ్యవహరించింది. ముస్లింల హక్కులను కాలరాచే చర్యలతో కోర్టు ఏకీభవించలేదనే విధంగా కూడా సంకేతాలు వెలువడ్డాయి. వీటి ఫలితంగానే ఉన్నత న్యాయస్థానంపై మరోసారి దాడి మొదలైంది. అన్ని ప్రజాస్వామ్య శక్తులు గొంతు కలిపి న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడేందుకు ముందుకు రావాల్సిన సమయం. ఇది సుప్రీంకోర్టును వదిలిపెట్టండి అని నినదించాల్సిన సమయం.

# విద్యా కుసుమాలు!



'ఎదగడానికెందుకురా తొందరా-ఎదర బతుకంతా చిందర వందరా..' అంటారు ఒక సినీ గీతంలో ఆరుద్ర. విద్యార్థి దశలో ఎదుర్కొనే పరీక్షలు, వాటిని అధిగమించడానికి పడే తిప్పలు వేసే తెల్లమొఖాలను కూడా ఈ పాటలో ఆయన ప్రస్తావిస్తారు. 'మ్యాటనీ ఆట ఉంది. బోటనీ పాఠముంది సోదరా, ఏది బెస్టురా.?.. అంటే 'ఉందిగా సెప్టెంబర్..మార్చిపైనా..' అంటూ వాయిదా పద్ధతులను తలచుకునే తరం కూడా మారింది. ఇప్పటి విద్యార్థులకు పరీక్షలు వాటి ఫలితాలు జీవన్మరణ సమస్యలుగా మారాయి. నూటికి నూరు శాతం మార్కులు, అత్యుత్తమ ర్యాంకులు కొలబద్దలుగా నిలిచాయి. పోటీ ప్రపంచపు తూకపు రాళ్లలో ఒక్క గ్రాము అటు ఇటూ అయినా విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల తరువాత నలుగురు, ఇంటర్మీడియట్ ఫలితాల తరువాత ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వచ్చిన వార్తలే నిదర్శనం. వెలుగు చూడనివి ఇంకొన్ని ఉండవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక విద్యార్థి బలవన్మరణం పాలవుతున్నాడు. వీరిలో అత్యధికులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్.సి.ఆర్.బి) గణాంకాల ప్రకారం 2014 నుండి 2022 వరకు రాష్ట్రంలో 3,690 మంది విద్యార్థులు (వీరిలో 1,609 మంది బాలికలు) అర్థాంతరంగా జీవితాలను ముగించారు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో కారణాలు ఏవైనా విద్యార్థుల ఆత్మహత్యలు 72 శాతం రాష్ట్రంలో పెరిగాయి. ఇటీవల పాత్రికేయులు ఇదే విషయాన్ని విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో ప్రస్తావించగా, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న విషయాన్ని అంగీకరిస్తూనే 'దానికో ప్యాట్రన్ (పద్ధతి) లేదని చెప్పారు. విద్యావ్యవస్థకు దాపురించిన ఈ దుస్థితికి కారణాలను ఆయన చెప్పలేదు. 'డబ్బుకు లేదే సిగ్గు, ఎగ్గు, న్యాయం అదుంటే ఏ పనైనా ఖాయం' అని ఒక సినీ కవి రాస్తారు. ఉదారవాద ఆర్థిక సంస్కరణల యుగంలో అన్నింటికి డబ్బే కొలబద్ద! హద్దుల్లేని పెట్టుబడి లాభాల వేటలో ఖండాంతరాలు దాటి పరుగులు తీస్తుంటే, విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం వంటి కనీస అవసరాలు సామాన్యులకు ఎండమావులుగా మారుతున్నాయి. వాటి కోసమే తల్లిదండ్రులు తమ చిన్నారులను పరీక్షల, ర్యాంకుల ఎడారుల్లో పరుగులు పెట్టిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులదీ ఇదే స్థితి. ఎప్పటికప్పుడు కొత్త ర్యాంకర్లను ఉత్పత్తి చేయకుంటే వేలాడుతున్న కత్తి వారి మెడమీద పడటం ఖాయం! ఈ భయోత్పాత స్థితే అభం, శుభం తెలియని పసిపిల్లలకు మరణశాసనమౌతోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం పూచీ పడాలి. వాటిని ప్రాథమిక హక్కులుగా మార్చాలి. ఈ స్ఫూర్తిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారిని కదిలించే బాధ్యతను అభ్యుదయ శక్తులు తీసుకోవాలి. భవిష్యత్తు పట్ల భయంలేని సమాజంలోనే కదా వేల ఆలోచనలు వికసించేది! 'వేర్ ద మైండ్ ఈజ్ వితవుట్ ఫియర్' అంటారు విశ్వకవి రవీంద్రుడు! పుట్టగానే పరిమళించే పువ్వుల పక్కనే, ఒక్క పుట్టుకలోనే రెండు జన్మలెత్తి ఇంద్రధనస్సు రెక్కలు తొడుక్కున్న సీతాకోకచిలుకలు ఉంటాయి. ఆ సీతాకోకచిలుకలు లేకుంటే, వాటి కష్టమే లేకుంటే పువ్వులెక్కడీ జీవరాశి మనుగడ ఎక్కడీ ప్రకృతిలో ప్రతి జీవికి తనదైన ప్రత్యేక నైపుణ్యం ఉంటుంది. మనుషులకు, విద్యార్థులకూ అంతే! పాఠశాల దశలో అష్టకష్టాలు పడిన ఐన్‌స్టిన్, థామస్ అల్వా ఎడిసన్, మన భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌లు సాధించిన ఘనతలే దీనికి ఉదాహరణలు. 'కృషి ఉంటే మనుషులు రుషులు (మేధావులు) అవుతారు మహా పురుషులవుతారు తరతరాలకు తరగని వెలుగవుతారు. ఇలవేలుపులౌతారు.' అంటే ఇదే! తమకు నచ్చిన అంశంపై విద్యార్థులు దృష్టి సారించాలి. పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత! ఆ బాధ్యతను అవి నెరవేర్చకుంటే నిలదీయాలి. పిరికితనం మాని పోరాడాలి! 'అధ్యయనం పోరాటం! విద్యార్థి లోకపు నినాదంగా మారాలి! అప్పుడు మాత్రమే నిర్భీతితో విద్యా కుసుమాలు వికసిస్తాయి.యువతరం శిరమెత్తుతుంది. నవతరం గళం విప్పుతుంది.

